RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 111 శుక్రవారం, మే 31, 2024 పేజీలు : 4

### ఎన్నికల్లో పోటీ చేయకుండా మోడీపై అనర్హత వేటు వేయాలి... పిటిషన్‌ను కొట్టివేసిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేయకుండా ప్రధాని నరేంద్ర మోడీని అనర్హత వేటు వేయాలని కోరుతూ దాఖలైన ఒక పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు గురువారం కొట్టివేసింది. ఇది నిరాధార, నిర్లక్ష్యంతో దాఖలుచేసిన పిటిషన్‌గా కోర్టు అభివర్ణించింది. పిటిషన్‌లో పేర్కొన్న అంశాలు దురుద్దేశంతో కూడుకున్నవని, వీటిని అనుమతించలేమని జస్టిస్ సచిన్ దత్తా పేర్కొన్నారు. తాను పైలట్‌గా పనిచేస్తున్న ఎయిర్ ఇండియా విమానాన్ని 2018లో కూల్చడం ద్వారా దేశ భద్రతను దెబ్బతీయడానికి మోడీ, ఆయన సహచరులు ప్రయత్నించారని కెప్టెన్ దీపక్ కుమార్ తన పిటిషన్‌లో ఆరోపించారు. ఈ పిటిషన్‌ను పూర్తిగా అసంబద్ధమైనదిగా కోర్టు అభిప్రాయపడింది. ప్రధాని మోడీపై నిరాధార ఆరోపణలు చేయడానికే ఈ పిటిషన్ దాఖలు చేశారని న్యాయమూర్తి పేర్కొన్నారు.

# ఫైనల్ కాలే...

## లోగో పరిశీలనలో ఉందన్న సీఎం రేవంత్



హైదరాబాద్: జయ జయహే తెలంగాణ గేయాన్ని తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రభుత్వం ఆమోదం తెలిపిందని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి ఈ ఏడాది జూన్ 2వ తేదీ నాటికి పదేండ్లు పూర్తవుతున్న సందర్భంగా దశాబ్ధి ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. అదే వేడుకల్లో జయ జయహే తెలంగాణ గీతాన్ని జాతికి అంకితం చేస్తామని సీఎం చెప్పారు. రాష్ట్ర గీతంపై సచివాలయంలో గురువారం సాయంత్రం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు సీఎం రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కవి అందెశ్రీ, మ్యూజిక్ డైరెక్టర్ కీరవాణి, కాంగ్రెస్ మిత్ర పక్ష నేతలు హాజరయ్యారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర గీతంతో పాటు రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ధి ముగింపు వేడుకల నిర్వహణపై చర్చించారు. జయ జయహే తెలంగాణ గీతాన్ని రెండు వర్షన్లలో తయారు చేశారు. 2.30 నిమిషాల నిడివితో ఒక వర్షన్, 13.30 నిమిషాల నిడివితో పూర్తి వర్షన్ రూపొందించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆలపించేందుకు వీలుగా పూర్తి గేయంలో ఉన్న మూడు చరణాలతో రెండున్నర నిమిషాల నిడివితో సంక్షిప్త గేయం ఉంటుందని సీఎం ప్రకటించారు. ఈ రెండింటినీ రాష్ట్ర గీతంగానే పరిగణిస్తామని చెప్పారు. కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకే రాష్ట్ర గీతాన్ని ఆమోదించామని.. అధికారిక చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చాలని కూడా నిర్ణయించామని సీఎం చెప్పారు.

# సిగ్గుచేటు...

## చార్మినార్ గుర్తును తొలగిస్తారా: కేటీఆర్

హైదరాబాద్: హైదరాబాద్ అంటేనే చార్మినార్. కొన్ని శతాబ్ధాలుగా ఈ నగరానికి అదో ఐకాన్ సింబల్. ప్రపంచవ్యాప్తంగా హైదరాబాద్‌కు గుర్తింపు వచ్చింది చార్మినార్‌తోనే. మరి అలాంటి అద్భుత కట్టడాన్ని తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తన రాజముద్రలో ఓ చిహ్నంగా పెట్టుకున్నది. అయితే తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర చిహ్నం నుంచి చార్మినార్‌ను తొలగించే ప్రయత్నాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన ఎక్స్ అకౌంట్ వేదికగా స్పందించారు. ఎవరైనా హైదరాబాద్ గురించి ఆలోచిస్తే, వాళ్లు చార్మినార్ కట్టడం గురించి ఆలోచించకుండా ఉండలేరని, ఆ మహాద్భుత నిర్మాణానికి యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద గుర్తింపునకు కావాల్సిన అర్హతలు ఉన్నాయని కేటీఆర్ అన్నారు. అలాంటి ఐకానిక్ చార్మినార్ గుర్తును.. రాష్ట్ర లోగో నుంచి తొలగించాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కేటీఆర్ విమర్శించారు. అనుచిత కారణాలు చూపుతూ.. లోగో నుంచి చార్మినార్ గుర్తును తీసివేయడం సిగ్గుచేటు అని ఆయన అన్నారు.



## బిజెపి కనీసం 140 సీట్లు కూడా గెలవడం

# కష్టమే

- అఖిలేశ్ యాదవ్



మహారాజ్ గంజ్ (యూపి): ప్రస్తుత లోక్ సభ ఎన్నికల్లో బిజెపి కనీసం 140 సీట్లు గెలవడం కూడా కష్టమేనని సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ గురువారం అన్నారు. 'అబ్ కీ బార్ 400 పార్' అనే ఎన్డిఏ నినాదాన్ని ఆయన ఎద్దేవ చేశారు. ప్రజలు చాలా ఆగ్రహంతో ఉన్నారు, కనుక బిజెపికి 140 సీట్లు రావడం కూడా కష్టమేనన్నారు.
బిజెపి రైతుల రుణాలు మాఫీ చేయకుండా, పారిశ్రామికవేత్తలకు రుణాలు ఇస్తోందని అన్నారు.
ఇండియా బ్లాక్ ప్రభుత్వం ఏర్పడితే రైతుల రుణ మాఫీ జరుగుతుందని అఖిలేశ్ యాదవ్ తెలిపారు.
మహారాజ్ గంజ్ లో కాంగ్రెస్ అభ్యర్థి విరేంద్ర చౌదరి తరపున సంయుక్త ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ ఆయన ఈ వివరాలు తెలిపారు.
'ఇండియా బ్లాక్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలు ఇస్తాము, సైనిక దళాలలో అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తాము' అన్నారు.
మహారాజ్ గంజ్ పోలింగ్ జూన్ 1న జరుగనున్నది.

## రాజముద్ర, తెలంగాణ తల్లి విగ్రహం మార్పులపై...

# అసెంబ్లీలో చర్చిస్తాం



హైదరాబాద్: మరోవైపు రాష్ట్రంలో లోగో లొల్లి ప్రారంభమైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లోగో మార్పు వ్యవహారానికి రాజకీయ రంగు పులుముకుంది. అది రాష్ట్ర ప్రభుత్వం వర్సెస్ బీఆర్ఎస్ గా మారింది. కాకతీయ కళాతోరణం, చార్మినార్ ను లోగో నుంచి తొలగించాలని సర్కారు భావిస్తోందని బీఆర్ ఎస్ ఆరోపించింది. ఈ నేపథ్యంలో సచివాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో రేవంత్ మాట్లాడుతూ, . రాష్ట్ర ప్రభుత్వం అధికారిక చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చాలని నిర్ణయం జరిగిందని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల కళాకారుల నుంచి దాదాపు 500 నమూనాలు తమకు అందినట్లు వెల్లడించారు. ఇంకా నమూనాలన్నీ చర్చల దశలోనే ఉన్నాయని, చిహ్నానికి సంబంధించిన తుది రూపమేదీ ఇంకా ఖరారు కాలేదని చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహానికి సంబంధించి కూడా తుది నిర్ణయమేది జరగలేదని, కళాకారులు వివిధ నమూనాలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. కొత్త చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహాలకు సంబంధించి అపోహాలు, తప్పుడు ప్రచారాలకు తావు లేకుండా అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా తెలంగాణ ప్రతిష్ఠను ఇనుమడించేలా, భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేలా తమ కార్యాచరణ ఉంటుందని చెప్పారు.

# సిక్కిం వద్ద చైనా దందా....

## అధునాతన యుద్ధ విమానాలు మోహరింపు




న్యూఢిల్లీ: భారత్ సరిహద్దులో యుద్ధ విమానాలను చైనా మోహరించింది. సిక్కిం సమీపంలో అధునాతన స్టెల్త్ ఫైటర్స్‌ను ఉంచింది. మే 27న సేకరించిన ఉపగ్రహ చిత్రాల ద్వారా ఈ విషయం బయపడింది. సిక్కింకు 150 కిలోమీటర్ల దూరంలో సైనిక, ప్రజల అవసరాల కోసం వినియోగించే ఎయిర్‌పోర్ట్‌ను చైనా నిర్మించింది. టిబెట్‌లోని రెండవ అతిపెద్ద నగరమైన షిగాట్సేలో 12,408 అడుగుల ఎత్తులో ఉన్న ఈ ఎయిర్‌పోర్ట్ ప్రపంచంలోని ఎత్తైన విమానాశ్రయాలలో ఒకటి. ఈ ఎయిర్‌పోర్ట్‌లో ఆరు అధునాతన జే-20 ఫైటర్ జెట్‌లను చైనా మోహరించింది. ఎయిర్‌బోర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్ కేజే-500 కూడా ఇక్కడ ఉన్నట్లు ఉపగ్రహ చిత్రాలను విశ్లేషించే సంస్థ పేర్కొంది. కాగా, సిక్కిం సమీపంలో జే-20 యుద్ధ విమానాలను చైనా మోహరించడం గురించి ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్)కు తెలుసని సంబంధిత వర్గాలు తెలిపాయి. దీనికి కౌంటర్‌గా పశ్చిమ బెంగాల్‌లోని హసిమారా ఎయిర్‌బేస్‌లో 16 రాఫెల్స్ యుద్ధ విమానాలతో రెండవ స్క్వాడ్రన్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించాయి.


# అనారోగ్యమైతే ప్రచారం ఎలా చేశారు?



న్యూఢిల్లీ : ఢిల్లీ లిక్కర్ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ గురువారం రెగ్యులర్ బెయిల్ కోసం ఢిల్లీ కోర్టును ఆశ్రయించారు. అలాగే వైద్య పరీక్షలు చేయించుకోవడానికి మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలంటూ మరో పిటిషన్ వేశారు. వీటిపై జరిగిన వాదనల్లో భాగంగా, ఆయన అభ్యర్థనలను ఈడీ వ్యతిరేకించింది. ఎన్నికల వేళ విస్తృత ప్రచారం నిర్వహించకుండా ఆయన ఆరోగ్యమేమీ అడ్డంకిగా మారలేదని వెల్లడించింది. మనీలాండరింగ్ కేసులో మార్చి 21న కేజ్రీవాల్ అరెస్టయిన సంగతి తెలిసిందే. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ ఆలస్యమవుతుండడంతో ఎన్నికల్లో ప్రచారం నిర్వహించుకునేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అభ్యర్థించారు. దీంతో సుప్రీం కోర్టు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

## జమ్ము లోయలో బస్సు పడి

# 21 మంది మృతి



జమ్ము: జమ్ముకశ్మీర్ లో గురువారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం జరిగింది. జమ్ముపూంచ్ రహదారిపై బస్సు అదుపు తప్పి లోయలో పడిపోవడంతో 21 మంది మృతి చెందారని, 40 మంది గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. " ఉత్తరప్రదేశ్ లోని హత్రాస్ నుంచి ప్రయాణికులతో బయల్దేరిన బస్సు, జమ్ము లోని అఖ్నూర్ ప్రాంతంలో ప్రమాదానికి గురైంది. జమ్ముపూంచ్ రహదారిపై అదుపు తప్పి 150 అడుగుల లోతు లోయలో పడిపోయింది" అని వెల్లడించారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతాయని చెప్పారు. గాయపడిన వారిని అఖ్నూర్ లోని ఆస్పత్రికి తరలించినట్టు చెప్పారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్ర విచారం వ్యక్తం చేశారు. " ఈ ఘటన తీవ్రంగా బాధించింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను " అని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ పెట్టారు.

## కెసిఆర్‌కు సిఎం రేవంత్

# ప్రత్యేక ఆహ్వానం



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు రావాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను ఆహ్వానించారు సీఎం రేవంత్ రెడ్డి. జూన్ 2న ఉదయం 10 గంటలకు పరేడ్ గ్రౌండ్స్ లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల అధికారిక కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా కేసీఆర్ కు ప్రత్యేకంగా లేఖ రాశారు సీఎం రేవంత్ రెడ్డి. వ్యక్తిగత ఆహ్వాన లేఖ, ఆహ్వాన పత్రికను స్వయంగా కేసీఆర్ కు అందించాలని ప్రోటోకాల్ సలహాదారు వేణుగోపాల్, డైరెక్టర్ అరవింద్ సింగ్ కు సూచించారు సీఎం రేవంత్ రెడ్డి. లేఖను స్వయంగా కేసీఆర్ కు అందించాలని వేణుగోపాల్, అరవింద్ సింగ్ లకు బాధ్యతలు అప్పగించారు. కేసీఆర్ ను స్వయంగా కలిసి ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొనాలని ఆహ్వాన పత్రిక అందించేందుకు కేసీఆర్ సిబ్బందితో వారు చర్చలు జరిపారు. కేసీఆర్ గజ్వేల్ ఫామ్ హౌస్ లో ఉన్నారని సిబ్బంది తెలపడంతో అక్కడికి వెళ్లి స్వయంగా ఆహ్వాన పత్రిక, లేఖను అందించేందుకు ప్రయత్నిస్తున్నారు హర్కర వేణుగోపాల్, డైరెక్టర్ అరవింద్ సింగ్. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రేవంత్ సర్కార్ భారీ ఏర్పాట్లు చేసింది. ఇక జూన్ 2న కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ తెలంగాణకు రానున్నారు. జూన్ 2న ఉదయం 9 గంటలకు ఆమె హైదరాబాద్ చేరుకుంటారు.

## సంపాదకీయం

# చిత్రసీమలో దాసరి ఒరవడి...!

తెలుగు సినిమా రంగంలో ఆయన ఒక ట్రెండ్ సెట్టర్. చిత్ర నిర్మాణంలో ఏ విభాగంలో నైనా ఆయనది ప్రత్యేక శైలి. అయన ప్రత్యేక గుర్తింపు పొందిన సినిమా దర్శకులు, విలక్షణ నటులు, గీత, సంభాషణ రచయిత, చిత్ర నిర్మాత. అత్యధిక చిత్రాల దర్శకునిగా తెలుగు, హిందీ భాషల్లో 151 సినిమాలకు దర్శకత్వం వహించడం ద్వారా 'లిమ్కా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'ల్లోకి ఎక్కారు. గిన్నిస్ బుక్ లో స్థానం పొందారు. 53 సినిమాలు స్వయంగా నిర్మించారు. 250 పైగా చిత్రాలలో సంభాషణ రచయితగా లేదా గీత రచయితగా పని చేశారు. తెలుగు, తమిళం , కన్నడ భాషా చిత్రాలలో నటించి, నటనకుగాను ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉత్తమ నటునిగా బహుమతి కూడా పొందారు. అంతేకాదు రాజకీయ నాయకులు, కేంద్ర మంత్రిగా సుపరిచితులు. ఆయనే బహుముఖ ప్రజ్ఞాశాలి దాసరి నారాయణరావు. దాసరి నారాయణరావు ( మే 4, 1947 - మే 30, 2017) కళాశాలలో చదివే రోజులలో బీ.ఏ డిగ్రీతో ఉత్తీర్ణులు కావడంతో పాటు దాసరి అనేక నాటక పోటీలలో కూడా పాల్గొనేవారు. అనతి కాలంలోనే ప్రతిభ గల రంగ స్థల నటుడిగా, నాటక రచయితగా చిత్ర దర్శకుడిగా గుర్తింపు పొందారు. మోహన్ బాబు, ఆర్. నారాయణమూర్తి, కోడి రామకృష్ణ, రేలంగి నరసింహారావు, రవిరాజా పినిశెట్టి తదితర నటులు, దర్శకులు, ఎందరో సాంకేతిక నిపుణులను దాసరి తెలుగు చిత్ర పరిశ్రమకు పరిచయం చేశారు. సినీ రంగానికి పరిచయం చేసి ఎదిగేందుకు చేయూత అందించారు. ఒక సమయంలో ఆయన పేరిట తెలుగు నేలపై 18వందలకు పైగా దాసరి అభిమాన సంఘాలు ఉండేవంటే సామాన్యం కాదు. ఆదుర్తి సుబ్బారావు దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా, శిష్యరికం చేసి సినిమా దర్శకత్వంలో తనకంటూ ఓ ప్రత్యేకశైలిని అలవర్చుకున్నారు. తర్వాత భిన్నమైన చిత్రాలను రూపొందించారు. 1974లో తాతా మనవడు సినిమాతో సినీ ప్రస్థానం ప్రారంభించిన దాసరి తొలి సినిమాకే నంది అవార్డు అందుకొని సంచలనం సృష్టించారు. తాతా మనవడు, స్వర్గం నరకం, మేఘసందేశం, మామగారు అనేక అవార్డులు తెచ్చిపెట్టాయి. మేఘ సందేశం చిత్రాన్ని కేన్స్, షికాగో, మాస్కో అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో ప్రదర్శించారు. దాసరి తిసిన బొబ్బిలి పులి , సర్దార్ పాపారాయుడు చిత్రాలు నందమూరి తారక రామారావు రాజకీయ ప్రవేశములో ప్రధానపాత్ర వహించాయి. మామగారు, సూరిగాడు, ఒసేయ్ రాములమ్మ చిత్రాలు దాసరి నటనా కౌశలానికి మచ్చు తునకలుగా మిగిలాయి. ఆ సినిమాలలో నటనకు దాసరి అనేక విమర్శకుల ప్రశంసలు , బహుమతులు అందుకున్నారు. 1947, మే 4న పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లులో జన్మించారు. ఆయన తండ్రి తరం వరకూ వారి కుటుంబంలో ఎవరూ చదువు కోలేదు. దాసరిని చదివించే క్రమంలో, ఆరో తరగతి కొచ్చేసరికి వారి ఆర్థిక పరిస్థితి బాగా దెబ్బతింది. స్కూలు ఫీజు మూడుం పావలా కట్టడానికి కూడా డబ్బులేక బడి మాని, ఒక వడ్రంగి దుకాణంలో నెలకు రూపాయికి పని చేయాల్సి వచ్చింది. అయితే ఒక మాస్టారు సాయంతో మళ్ళీ చదువు కొనసాగించారు. రామోజీ రావు వార్తాపత్రిక ఈనాడుకు ధీటుగా భావించి ఉదయం దినపత్రికను ఆయన ప్రారంభించి, కొత్త జర్నలిజానికి పురుడు పోశారు. ఎందరినో జర్నలిస్టులు తీర్చిదిద్దారు. రాజీవ్ గాంధీ పాలనా కాలములో, దాసరి కాంగ్రెస్ పార్టీ పక్షాన ఔత్సాహికులై ఎన్నికల ప్రచారము సాగించారు. రాజీవ్ హత్యానంతరం పార్టీకి కాస్త దూరంగా జరిగారు. 1990 దశకం చివరిలో ఆయన తెలుగు తల్లి పేరిట రాజకీయ పార్టీని ప్రారంభించారు. ఈ పార్టీకి కోస్తా ప్రాంతాలలోని కాపు వర్గాల నుండి మంచి స్పందన లభించింది. తర్వాత మాత్రం కాంగ్రెస్ పార్టీకి అనుకూలురై, కాంగ్రెస్ పార్టీ తరపున రాజ్యసభకు ఎన్నిక అయ్యారు. బొగ్గు, గనుల శాఖకు కేంద్ర మంత్రిగా వ్యవహరించారు. సోనియా గాంధీకి సన్నిహితులుగా మెదిలారు. 1974లో తాతా మనవడు చిత్రానికి నంది అవార్డు, స్వర్గం నరకం సినిమాకు ఉత్తమ చిత్రంగా బంగారు నంది బహుమతి, 1983లో మేఘ సందేశం చిత్రానికి గాను ఉత్తమ దర్శకుడిగా నంది అవార్డు, 1992లో మామగారు చిత్రానికి గాను ఉత్తమ నటుడు నంది అవార్డు, 1986లో తెలుగు సంస్కృతి, తెలుగు చిత్ర రంగం నకు ఆయన చేసిన సేవలకు గాను ఆంధ్రా విశ్వ విద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్, ఫిల్మ్ ఫేర్ అవార్డు 6 సార్లు, మద్రాసు ఫిల్మ్ ఫాన్స్ అవార్డ్ 5 సార్లు, సినీ హెరాల్డ్ అవార్డ్ 10 సంవత్సరాలు వరసగాను పొందారు. జ్యోతిచిత్ర నుండి సూపర్ డైరెక్టర్ అవార్డ్ కు 3 సార్లు, పాత కాలం నాటి ఆంధ్రపత్రిక నుండి ఉత్తమ దర్శకుడిగా 6 సార్లు ఎంపిక అయ్యారు. తెలుగు సినీ పరిశ్రమలో ఎన్టీఆర్, దాసరి నారాయణ రావు సూపర్ హిట్ కాంబినేషన్ కాగా... ఎన్టీఆర్ రాజకీయాల్లో ప్రవేశించిన సమయానికి దాసరి తెరకెక్కించిన చిత్రాలు ప్రధాన పాత్రలు పోషించాయి. ఎన్టీఆర్, దాసరి నారాయణ రావు కలయికలో మొదటి సారి 'మనుషులంతా ఒక్కటే' సినిమా రాగా, బాక్సాఫీస్ సూపర్ హిట్‌గా నిలిచింది. ఎన్టీఆర్, దాసరి నారాయణ రావు కలయికలో వచ్చిన రెండో చిత్రం 'సర్కస్ రాముడు'.

# నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

**శామీర్ పేట, (గరుడ వార్త):** నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉండబోతుందని శామీర్ పేట ఏఈ రమేష్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శామీర్ పేట సెక్షన్ పరిధిలోని బొమ్మరాజు పెట విద్యుత్ సబ్‌స్టేషన్లో పొన్నాలు ఫీడర్ మరమ్మత్తుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పొన్నాల గ్రామానికి, వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రామాలయం పీడర్ పరిధిలో మరమ్మత్తులు చేపడుతున్నందున మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బొమ్మరాజుపేట గోడౌన్స్, వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని శామీర్ పేట విద్యుత్ ఏఈ రమేష్ కోరారు.

**అలియాబాద్ సెక్షన్ పరిధిలో....**

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని అలియాబాద్ ఏఈ శ్రీనివాస్ గౌడ్ ఓ ప్రకటనలో గురువారం పేర్కొన్నారు. మూడు చింతలపల్లి మండలం సంపన్ బోల్ పరిధిలోని విద్యుత్ సబ్ స్టేషన్ లో మరమ్మత్తుల కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు నిక్మార్ కాలేజ్, ఆల్ఫా మేడ్, హెరిటేజ్, కీర్తి పౌల్ట్రీ, సింజెంటా లతోపాటు పలు డొమెస్టిక్, అగ్రికల్చర్ సర్వీస్ ల పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని చెప్పారు. ఈ విషయం విద్యుత్ వినియోదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఏఈ శ్రీనివాస్ గౌడ్ కోరారు.

# స్మశాన వాటిక కబ్జా చేస్తే చర్యలు తప్పవు



**శామీర్ పేట, (గరుడ వార్త) :** శామీర్ పేట స్మశాన వాటిక ను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని పంచాయతీ కార్యదర్శి మౌనిక హెచ్చరించారు. గురువారం పంచాయతీ కార్యదర్శి మౌనిక స్మశాన వాటిక స్నానాల గదిని పరిశీలించి బోర్డుని ఏర్పాటు చేశారు. శామీర్ పేట గ్రామంలోని స్మశానవాటికలో ఏర్పాటు చేసిన స్నానాల గదిని పశువుల పాక గా మార్చరని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు శామీర్ పేట గ్రామ పంచాయతీ కార్యదర్శి మౌనిక దృష్టికి తీసుకెళ్ళారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రజా అవసరాల కొరకు ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన స్నానాల గదిని కొందరు వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నిస్తునారని ఆరోపించారు. దీంతో పంచాయతీ కార్యదర్శి మౌనిక సందర్శించారు. అనంతరం అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలను ఎవరైనా కబ్జా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిత్రపురి కాలనీలో చిత్రలు చూడతరమా

**హైదరాబాద్:** రియల్ ఎస్టేట్ రంగంలో ఇప్పుడు రోజుకో వ్యవహారం వెలుగులోకి వస్తుంది. కానీ, చిత్రపురి కాలనీ చిత్రవిచిత్రాలు ఎన్ని తవ్వినా కొత్తవి బయటపడుతూనే ఉంటాయి. సినిమా వాళ్ల కోసమే కేటాయించబడిన ఈ కాలనీలో అనేక అక్రమాలు జరిగాయనే ఆరోపణలు ఉన్నాయి. పోలీసులకు ఫిర్యాదులు, కోర్టు కేసులు, దర్యాప్తులు ఇలా ఎన్నో ఏళ్లుగా ఎన్నో వివాదాలు కొనసాగుతున్నాయి. తాజాగా చిత్రపురి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వల్లభనేని అనిల్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో మరోసారి ఈ అంశం చర్చనీయాంశమైంది. మణికొండ ఏరియాలో ఉంటుంది ఈ చిత్రపురి కాలనీ. సినిమా వాళ్లకు ఇళ్ల కేటాయింపునకు సంబంధించి కమిటీ సభ్యులుగా పరుచూరి వెంకటేశ్వర్ రావు, వినోద్ బాల, చంద్ర మధు, కాదంబరి కిరణ్, మహానందరెడ్డితో పాటు పలువురు ఉన్నారు. చాలామందికి ఇళ్లు కేటాయించారు. కానీ, భారీగా అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. దాదాపు 160 మంది నుంచి డబ్బులు వసూలు చేసి ఇళ్లు కేటాయించలేదు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన వారంతా విసుగు చెంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకటే ఫ్లాట్‌ను ఇద్దరు, ముగ్గురికి కేటాయించినట్టు బాధితులు చెబుతున్నారు. మాదాపూర్‌కు చెందిన తోట శ్రీపద్మ దగ్గర 12 లక్షలు తీసుకుని ఇల్లు అలాట్ చేశారు. కానీ, అదే ఫ్లాట్‌ను మరొకరికి రిజిస్ట్రేషన్ చేశారు. ఇలా చాలామందికి జరిగింది. దీంతో పోలీసులు ఎంట్రీ ఇచ్చారు. కాలనీ స్కాంలో సొసైటీ ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్ కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతన్ని కస్టడీకి ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేయగా, అందుకు న్యాయస్థానం అనుమతించింది. రెండు రోజుల పాటు అనిల్‌ను కస్టడీకి తీసుకున్నారు రాయదుర్గం పోలీసులు. అతని నుంచి కూపీ లాగుతున్నారు. ఈ స్కాంలో మిగతా సభ్యుల పాత్రపైనా దర్యాప్తు జరుగుతోంది. బాధితుల డబ్బు ఎక్కడికి వెళ్లింది అన్న కోణంలో విచారణ చేస్తున్నారు పోలీసులు. భారీగా డబ్బులు చేతులు మారినట్టు గుర్తించారు. బాధితుల ఒక్కొక్కరి నుంచి 4 లక్షల నుంచి 40 లక్షల దాకా వసూలు చేసినట్టు పోలీసులు చెబుతున్నారు. ఈ వ్యవహారంలో అనిల్‌తోపాటు వెంకటేశ్వర్ రావు, వినోద్ బాల, చంద్ర మధు, కాదంబరి కిరణ్, మహానందరెడ్డితోపాటు మరికొందరిపై కేసు నమోదైంది. ఆరుగురు పరారీలో ఉన్నారు.

# ఈ ఎన్నికలు నవశకానికి నాంది : మోడీ



న్యూఢిల్లీ: శనివారం పోలింగ్ నేపథ్యంలో తన నియోజకవర్గం వారణాసి ఓటర్లకు ప్రధాని మోడీ గురువారం ఓ సందేశం వెలువరించారు. ఈ ఎన్నికలు కేవలం నవకాశీ నిర్మాణం కోసమే కాదు, సంపన్న భారతదేశ ఆవిష్కరణకు అని తెలిపారు. జూన్ 1వ తేదీన జరిగే ఎన్నికల్లో కాశీ ప్రజలు సరికొత్త రికార్డును సృష్టించాల్సి ఉందని పిలుపు నిచ్చారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసికి ప్రధాని మోడీ 2014 నుంచి ఎంపిగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ నవిత్రస్థలానికి ప్రాతినిధ్యం వహించడం అంటే సాధారణ విషయం కాదని, కేవలం ఇది ఆ బాబా కాశీ విశ్వనాథుడి అపారదయతోనే సాధ్యమయ్యే విషయం అని తేల్చిచెప్పారు. ఈ క్షేత్రానికి ఎనలేని విలువ ఉంది. తనకు సంబంధించి ఈ నగరం ఆధ్యాత్మికత, భక్తి , శక్తి, సేవాదృకథపు నిలయం. కాశీ సాంస్కృతిక వేదిక. ఈ విషయంలో ప్రపంచానికి ఓ రాజధాని, సంగీత స్థలి, ఇక్కడి నుంచి సేవాభాగ్యం దక్కడం తనకు దక్కిన అదృష్టం అన్నారు. గత పది సంవత్సరాల వ్యవధిలో ఈ ప్రాంతం అన్ని విధాలుగా విలసిల్లిందన్నారు, యువజన సంక్షేమానికి పట్టుగొమ్మ అయింది. పలు అంశాలలో ఇక్కడి ప్రజల ఉత్సాహం ఉత్తేజం తనను కదిలించి వేసిందన్నారు. కాశీని మరింతగా ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లేందుకు తాను కంకణం కట్టుకున్నానని, ఈ ఎన్నికలలో అత్యధిక సంఖ్యలో ఓటర్లు బార్లు తీరి ఓటేస్తే ఇది మరింత సాధ్యం అవుతుందన్నారు. ఈ సందర్భంగా తాను యువతకు,మహిళా శక్తికి , స్థానిక రైతులకు ప్రత్యేక విజ్ఞప్తి చేయదల్చుకున్నానని, ప్రతి ఓటరు తనకు మరింత బలం కల్పిస్తారని , సేవా మార్గంలో నూతన శక్తిని కల్పిస్తారని తెలిపారు. ప్రతి ఓటరు ముందు తాము ఓటేయాలి తరువాతే సేదదీరాలని గుర్తుంచుకోవల్సి ఉందని తమ వీడియో సందేశంలో పేర్కొన్నారు. వారణాసితో పాటు యుపిలోని మిగిలిన 13 లోక్‌సభ స్థానాలకు శనివారం ఓటింగ్ జరుగుతుంది. 2014లో మోడీ ఇక్కడి నుంచి 3.7 లక్షలకు పైగా మెజార్టీతో గెలిచారు.

# అంతరిక్షం లోకి భారత్ సరికొత్త "అగ్నిబాణ్ "




న్యూఢిల్లీ : చెన్నై ఐఐటీ కేంద్రంగా పనిచేసే అగ్నికుల్ సంస్థ రూపొందించిన "అగ్నిబాణ్" గురువారం ఉదయం 7.15 గంటల సమయంలో విజయవంతంగా ప్రయోగించినట్టు ఇస్రో ప్రకటించింది. ప్రత్యేక శ్రేణి ఉపగ్రహాలను వీలైనంత వేగంగా , కారు చౌకగా కక్ష లోకి ప్రవేశ పెట్టేందుకు వీలుగా ఈ ప్రయోగం చేపట్టారు. అగ్నిబాణ్ పేరిట తొలిసారి సబ్‌ఆర్బిటాల్ టెక్నాలజీ డెమానిస్ట్రేటర్ ప్రయోగాన్ని నిర్వహించింది. దీంతో ప్రపంచ అంతరిక్ష మార్కెట్లను ఒడిసి పట్టేలా భారత్ మరో కీలక ముందడుగు వేసింది. ఇందులో తొలిసారి సెమీ క్రయోజనిక్ ఇంజిన్ లిక్విడ్ ఇంజిన్ కంట్రోల్డ్ ఫ్లైట్ నిర్వహించినట్టయింది. అగ్నికుల్ కాస్మోస్ సంస్థను ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ అభినందించారు. వాస్తవానికి ఈ ప్రయోగం దాదాపు నెలన్నర క్రితమే జరగాల్సి ఉంది. కానీ నాలుగుసార్లు వాయిదా పడింది. ఐదోసారి విజయవంతంగా పూర్తి చేసుకొంది. ఈ ప్రయోగం దాదాపు రెండు నిమిషాల పాటు సింగిల్ స్టేజ్ లోనే జరిగింది. దీనిలో ప్రపంచం లోనే తొలిసారి తయారు చేసిన సింగిల్‌ఫేస్ త్రీడీ ప్రింటెడ్ సెమీ క్రయోజనిక్ ఇంజిన్‌ను అమర్చారు. దీనిపై అగ్నికుల్ కాస్మోస్‌కు పేటెంట్ ఉంది. ఇది సబ్‌కూల్డ్ ద్రవ ఆక్సిజన్ ఆధారంగా ఒక స్టేజీలోనే పనిచేసింది. ఈ వ్యవస్థను పూర్తిగా దేశీయంగానే అభివృద్ధి చేశారు. దీర్ఘ వృత్తాకార ముక్కుతో ఉన్న ఈ రాకెట్ పొడవు 6.2 మీటర్లు. దీని లోపలే ఉపగ్రహాన్ని అమర్చారు. ఈ రాకెట్ తొలిసారి ఈథర్‌నెట్ ఆధారంగా పనిచేసే ఏవియానిక్స్ వ్యవస్థను వాడారు. పూర్తిగా దేశీయంగా అభివృద్ధి చేసిన ఆటోపైలెట్ కంట్రోల్ సిస్టమ్‌ను ఇందులో వినియోగించారు. ఒకవేళ ప్రయోగం అదుపు తప్పితే తక్షణమే దానిని నాశనం చేసేలా ఇస్రో అభివృద్ధి చేసిన ఫ్లైట్ టర్మినేషన్ వ్యవస్థను కూడా దీనిలో అమర్చారు. పలురకాల లాంచర్ల నుంచి ప్రయోగించేలా దీనిని నిర్మించారు. 300కిలోల లోపు బరువున్న ఉపగ్రహ ప్రయోగాలకు వెంటనే అవకాశాలు దొరకవు. ఇలాంటి వాటి కోసం అగ్నికుల్ నిర్మించిన రాకెట్ సరిపోతుందని భావిస్తున్నారు.

**ప్రయోగం రెండు నిమిషాలే ..**

ఈ మొత్తం ప్రయోగం దాదాపు రెండు నిమిషాలు మాత్రమే జరిగింది. ముగిశాక రాకెట్ సముద్రంలో కూలిపోయింది. శ్రీహరికోట లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన తొలి ప్రైవేట్ లాంచ్ ప్యాడ్ ఏఎల్‌పీ ఈ పరీక్షకు వేదికైంది. ఈ రాకెట్ ప్రయోగించిన తరువాత నాలుగు సెకన్ల సమయం లో నిర్ణీత దిశకు మళ్లింది. 1.29 నిమిషాల సమయానికి ఇది నిర్ణీత ప్రదేశానికి చేరి అక్కడ నుంచి తిరిగి సముద్రంలో పడింది. అగ్నికుల్ ఇంజిన్, ఆకారం వాటిని విశ్లేషించి మరింత మెరుగుపరచడానికి ఈ రెండు నిమిషాల పరీక్ష ఉపయోగ పడుతుంది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ అగ్నికుల్ సంస్థను అభినందించారు. ప్రపంచం లోనే తొలిసారి 3 డీ ప్రింటెడ్ రాకెట్ ఇంజిన్ కావడం విశేషమన్నారు.

# డ్రగ్స్ మహమ్మారిపై ఉక్కుపాదం..

## నకిలీ సీడ్స్ కట్టడికి స్పెషల్ టాస్క్‌ఫోర్స్




**మల్కాజిగిరి:** డ్రగ్స్ కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని, నకిలీ విత్తనాలు అరికట్టేందుకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశామని రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్ జోషీ అన్నారు. ఘట్‌కేసర్‌లో గురువారం జరిగిన నేర సమీక్షలో మాట్లాడారు. ఈ సమావేశంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు. నిషేధిత మత్తుపదార్థాల వాడకం అనేది సమాజానికి పట్టిన చీడపురుగు వంటిదని, డ్రగ్స్ సరఫరా చేస్తున్న అంతరాష్ట్ర ముఠాలను అణచివేయాలని సీపీ తరుణ్ జోషీ చెప్పారు. దందా చేసే వారిపై పీడీ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలన్నారు. డ్రగ్స్ వినియోగాన్ని సమూలంగా ప్రక్షాళన చేయాలని చెప్పారు. డ్రగ్స్ వాడకంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని సీపీ పేర్కొన్నారు. యువతలో మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. జూలై ఒకటో తేదీ నుంచి భారత ప్రభుత్వ నూతన నేరన్యాయ చట్టాలు-2023 అమలులోకి రానున్న నేపథ్యంలో పలుకేసుల దర్యాప్తు, విచారణలో పాటించవలసిన నూతన విధానాలపై పోలీసు అధికారులు, సిబ్బంది తెలుసుకుని ఉండాలన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో నకిలీ విత్తనాల సరఫరా, క్రయవిక్రయాలను అరికట్టేందుకు తీసుకోవలసిన చర్యల మీద సీపీ జోషీ అధికారులకు పలు సూచనలు చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలు వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నకిలీ విత్తన, ఎరువుల దుఖానాలపై దాడులు నిర్వహించాలని ఆదేశించారు. విత్తనాల ప్యాకెట్ల మీద అధీకృత సమాచారం, లోగో హోలోగ్రాం వంటి వాటిని పరిశీలించాలని, వ్యవసాయశాఖ అధికారులు ధ్రువీకరించిన ప్రముఖ కంపెనీల విత్తనాలు మాత్రమే షాపుల్లో అమ్మేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# మహారాష్ట్రపై గులాబీ గురి

**ముంబై, మే :** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పుట్టిన భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) అలియాస్ తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్)కు జన్మస్థానంలోనే ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. అసెంబ్లీ ఎన్నిల్లో ఓటమి తర్వాత ఆటుపోట్లు ఎదుర్కొంటోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా రాకపోవచ్చని ఆ పార్టీ నేతలే గుసగుసలాడుతున్నారు. ఫలితాల తర్వాత పార్టీ పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని అధినేత గుర్తించారు. దీంతో దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి అన్నట్లు.. పార్టీ పతారను పక్క రాష్ట్రం మహారాష్ట్రలో చూపెట్టడంపై దృష్టిపెట్టారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ పరిస్థితిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. మహారాష్ట్రలో మరో నాలుగు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో అధికారం కోల్పోయిన భారత రాష్ట్ర సమతి.. వచ్చే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఉనికి చాటాలని భావిస్తోంది. ఈ క్రమంలో ఆ రాష్ట్రంలో తెలుగు వారు ఎక్కువగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలపై ఫోకస్ పెట్టింది. తెలుగు వారు ఉండే రాష్ట్రాల్లో పోటీ చేయడానికి కసరత్తు చేస్తోంది. మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి కూడా మొదలు కానుంది. అయితే, బీఆర్ఎస్ వీటిపై కాకుండా అసెంబ్లీ స్థానాలపైనే దృష్టి పెట్టాలని భావిస్తోంది. అధికారంలో ఉన్నప్పుడే మహారాష్ట్రలో పార్టీ విస్తరణ చేపట్టిన గులాబీ బాస్ అక్కడ పార్టీ రాష్ట్ర కార్యాలయం కూడా ప్రారంభించారు. వివిధ పార్టీలకు చెందిన నేతలను బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారు. అయితే తెలంగాణ ఎన్నికల్లో ఓటమి తర్వాత, లోక్‌సభ ఎన్నికల ముందు ఆ నేతలంతా తమదారి తాము చూసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్ర నుంచి బీఆర్ఎస్ పోటీ చేయకపోవడమే ఇందుకు కారణం. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తే.. మళ్లీ కొత్త నేతలు వస్తారని కేసీఆర్ భావిస్తున్నారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలి అంటారు పెద్దలు.. బీఆర్ఎస్ పరిస్థితి మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉంది. ఇంట ఓడిపోయి.. రచ్చ గెలవాలని చూస్తున్నారు ఆ పార్టీ అధినేత కేసీఆర్. గులాబీ బాస్ తీరుతో పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. ఇప్పటికే తెలంగాణలో పార్టీ భవిష్యత్ ఏమిటో అర్థం కాని పరిస్థితి. ఈ క్రమంలో కేసీఆర్ మహారాష్ట్రపై దృష్టిపెట్టడం, అక్కడ సత్తా చాటాలని పాకులాడడంపై గుసగుసలాడుతున్నారు. కేసీఆర్ తీరుతో తెలంగాణలో పార్టీ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని గులాబీ నేతలు భావిస్తున్నారు. ఇది పార్టీకి ఏమాత్రం మంచిది కాదని పేర్కొంటున్నారు.

## నటి హేమకు మరోసారి బెంగళూరు పోలీసుల నోటీసులు జారీ



**బెంగళూరు:** టాలీవుడ్ నటి హేమకు మరోసారి బెంగళూరు పోలీసుల నోటీసులు జారీ చేశారు. రేవ్ పార్టీ కేసులో జూన్ 1న విచారణకు హాజరుకావాలంటూ సిసిబి పోలీసులు నోటీసులు జారీ చేశారు. బెంగుళూరు రేవ్ పార్టీలో ప్రముఖ తెలుగు నటి హేమతోపాటు పలువురు నటులు పాల్గొన్న సంగతి తెలిసిందే. నటి హేమ రక్త నమూనాల్లో డ్రగ్స్ తీసుకున్నట్టుగా తేలింది. దాదాపు 150 మంది రక్త నమూనాలను నార్కోటిక్ టీమ్ సేకరించి పరీక్షించింది ఈ రక్త నమూనాలో 59 మంది పురుషులు, 27 మంది మహిళలు.. మొత్తం 86 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్లు నార్కోటిక్ టీమ్ వెల్లడించింది. ఈ క్రమంలో నటి హేమ సోమవారం బెంగళూరు పోలీసుల ముందు హాజరు కావల్సి ఉంది. అయితే హేమ పోలీసుల ముందు హాజరు కాకుండా వారికి ఒక లేఖ రాశారు. తాను వైరల్ ఫీవర్ తో బాధపడుతున్నానని చెప్పిన నటి హేమ ఇప్పుడు తాను విచారణ కు హాజరు కాలేనని లేఖలో రాశారు. దీంతో మళ్లీ ఆమెకు పోలీసులు నోటీసులు జారీ చేశారు.

## జీతాలు లేకుండా బ్రతికేది ఎలా



**మెదక్:** ఆరు నెలలుగా జీతాలు లేవు.. మేమెట్లా బతికేది.. మాపై ప్రభుత్వం ఎందుకు కక్షగట్టింది.. అందరి ఉద్యోగులకు ఇచ్చినట్టు మాకు కూడా నెలనెలా ఇచ్చి ఆదుకోవాలని గ్రామాల్లో పనిచేస్తున్న పంచాయతీ సఫాయి కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సూరీడు పొడవక ముందే ఇంటింటా తిరుగుతూ చెత్తబండి వచ్చిందమ్మా?తడిపొడిచెత్త వేరుచేసి ఇవ్వండమ్మా?అంటూ గ్రామంలో తిరుగుతూ ఊరును శుభ్రం చేస్తున్న సఫాయి కార్మికుల బాధలు వర్ణణాతీరం. పొద్దంతా కూలి పనిచేసి వచ్చిన డబ్బులతో పూట గడుపుకొనే ఈ రోజుల్లో? ఆరునెలులుగా వారికి జీతాలు అందడం లేదు.మెదక్ జిల్లా చేగుంట మండలంలో సుమారు 150 మందికి పైగా సఫాయి కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి గత ఆర్నెల్ల నుంచి జీతాలు రావడం లేదు. కొన్ని గ్రామ పంచాయతీల్లో వారి బాధలు చూడలేక కార్యదర్శులు బయట అప్పుతెచ్చి రెండు, మూడు నెలల జీతాలు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకుంటున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో పంచాయతీలను నడపడం మునుపెన్నడూ లేనంత భారంగా మారిందని, పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేస్తే బాగుండేదని కార్యదర్శులు అంటున్నారు. రోజూ శుభ్రం చేసి, ఊరులోని చెత్తను తొలిగిస్తున్న తమకు జీతాలు చెల్లించాలని సఫాయి కార్మికులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

## కలకం రేపుతున్న చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా




**హైదరాబాద్:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా యాక్టివిటీస్ ఇతర్రాష్ట్రాల్లో కూడా ఉన్నట్టు పోలీసుసు అనుమానిస్తున్నారు. ఆ దిశగా రాచకొండ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంకా ఏ ఏ రాష్ట్రాల్లో ఈ ముఠా కార్యకలాపాలు చేపట్టిందో ఆరా తీస్తున్నారు. ప్రస్తుతానికి ఓ బృందం ఢిల్లీ వెళ్లినట్టు తెలుస్తోంది. చైల్డ్ ట్రాఫిక్ కేసులో ఇప్పటి వరకు అరెస్టు చేసిన నిందితులు ఇచ్చిన సమాచారంతో మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. ఈ కేసులో కిరణ్, ప్రీతిదే కీలక పాత్రగా అనుమానిస్తున్నారు. వాళ్ల కోసం వేట మొదలు పెట్టారు. 50 మందికిపైగా చిన్నారులను విక్రయించినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. వీరిలో 16 మందిని గుర్తించారు. ఇంకా మిగతా వారి ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో పిల్లల్ని కొనుగోలు చేసిన తల్లిదండ్రులపై కేసులు పెట్టడం ఇక్క మరో ట్విస్టు. దీంతో ఆ ఫ్యామిలీలు బోరున విలపిస్తున్నాయి. తెలిసో తెలియకో పిల్లలు లేరని బెంగతోనో చిన్నారులను కొనుక్కున్నామని వాపోతున్నారు. ఇన్ని రోజులు పెంచుకున్న మమకారంతో వారిని విడిచి పెట్టలేక పోలీస్టేషన్ వద్దే కన్నీరు మున్నీరుగా విలపించారు. తాము ఆ బిడ్డల్ని కనకపోయినా కడుపులో పెట్టుకొని అంతకంటే ఎక్కువగా పెంచుకున్నామని అంటున్నారు. ప్రాణానికి ప్రాణంగా పెంచుకున్న చిన్నారులను దూరం చేయొద్దని వేడుకుంటున్నారు. సంతానం లేక ఇబ్బంది పడుతున్న ఫ్యామిలీలు పిల్లల కోసం లక్షలు వెచ్చించారు. ఏదో రూపంలో ఇంట్లోకి పిల్లలు వస్తున్నారన్న ఆనందంతో తప్పులు చేస్తున్నారు. పిల్లల్ని ఇలా దత్తత తీసుకోవాలంటే దానికో నియామవళి ఉంది. అప్పుడే అధికారులు దాన్ని గుర్తిస్తారు. ఇలా ఎవరి వద్ద పడిదే వాళ్ల వద్ద కొంటే సమస్యలు కొని తెచ్చుకున్నట్టే. ఇలా పిల్లల్ని కొనుగోలు చేస్తున్న వారిలో చాలా మంది ఆర్థికంగా కూడా అంతంత మాత్రంగానే ఉన్నవాళ్లు ఉన్నారు. ఇలాంటి వాళ్లు కూడా అప్పులు చేసి డబ్బులు చెల్లించి పిల్లల్ని కొంటున్నారు.

# అపర శ్రీశుకుడు రాజన్న శాస్త్రి.....




కోటి రతనాల వీణ తెలంగాణ లోని కరీంనగర్ జిల్లా గోదావరి తీరం శ్రీలక్ష్మీనర సింహ దివ్య పుణ్యక్షేత్రం. ధర్మపురిలో వేద పురాణ జ్యోతిష, సంగీత, సాహిత్య కళా రంగాలకు చెందిన పండితులు, విద్వాంసులు, ఆధ్యాత్మిక వేత్తలు జన్మించి ఆఖండ కీర్తి ప్రతిష్టలు గడించారు. జీవితాంతం భాగవత చింతన తోనే గడుపుతూ 5 దశాబ్దాలుగా పలు వేదికలపై అద్భుత ప్రవచనాలు చేసిన మహానుభావుడు, కర్మ యోగి గుండి రాజన్న శాస్త్రి. ఆబాల గోపాలాన్ని పరవశింపజేసే శాస్త్రి ప్రవచనాలకు దేశవిదేశీయులు సైతం అభిమానులయ్యారు. అపరశుక, వాల్మీకి, వ్యాసునిగా ప్రసిద్ధిగాంచిన ఆయన పాలరాతి విగ్రహాన్ని ధర్మపురిలో నెలకొల్పారంటే శాస్త్రి గొప్పతనం అర్థం చేసుకోవచ్చు. గుండి లక్ష్మీనరసింహ ఘనాపాటీ, లక్ష్మీ నర్సమ్మ దంపతులకు 9,12.1898లో జన్మించిన శాస్త్రి గుండి పాపయ్యశర్మకు దత్త పుత్రుడయ్యాడు. ఉర్దూ మాద్యమంలో ప్రాథమిక విద్య, సంస్కృతాంధ్ర భాషల్లో పాండిత్యం వొఝుల హన్మంతయ్య సిద్ధాంతి వద్ద లీలావతి గణితం, లౌకిక విద్యలు, తండ్రి వద్ద వేదాధ్యయనం మంథెన గట్టు కృష్ణమూర్తి వద్ద వేదాంగాలు, ఉపనిషత్తులు, ప్రస్తాన త్రయం, శాస్త్రాధ్యయనం, ఇతిహాస పురాణాదులలో శిక్షణ పొందారు. భార్య పేరు గుండమ్మ, ఆయనకు నలుగురు కుమారులు ఒక కుమార్తె కలిగారు. భాగవత, శ్రీవైష్ణవ సంప్రదాయానికనుగుణంగా ముకుందుడు, రఘురాముడు, అచ్యుతుడు, గోవిందుడు, హరిప్రియ అని నామకరణాలు చేశారు. మూర్తీభవించిన భాగవతంగా పేరొందిన నవయో గీంద్ర భిక్షుగీత, ఉద్దవ బోధనలు, రుక్మిణీ కల్యాణం గోపికాగీతాలు, కుంతి, భీష్మ, ధృవ, ప్రహ్లాద, గజేంద్ర బ్రహ్మస్తవరములు, ఇతిహాసాలు, మృదుమధురంగా ప్రవచించేవారు. ఇప్పటికీ ఆయనను అందరూ అవతార పురుషుడుగా, దైవాంశ సంభూతుడుగా, వ్యాసుడే భువిపైకి రాజన్న పేరుతో వచ్చాడని భావిస్తారు. ఆయన కులమతాలకతీతంగా కలిసిపోవడం, ధర్మపురిలో వారసంత నిర్వహణకు ప్రేరణ, బాలబాలికలను చేరదీసి సంస్కృతం మాట్లాడించడం, వితంతువులకు విద్య అవసరమని భావించి వారిని చదివించడం లాంటి కార్యక్రమాలు నిర్వహించారు. భూస్వాములు, దొరలు వస్తే వారిని తన ప్రవచనాలతో దాతలుగా మార్చేవారు. భాగవతంలో 18వేల శ్లోకాలు కంఠతా చదువుతూ అర్థతాత్పర్యాదులను వివరించ గలిగే అసాధారణ ధారణ శక్తి కలవారు. శాస్త్రి పాలరాతి విగ్ర హాన్ని గోదావరి నది వద్ద శ్రీరామ ఆలయ సమీపంలో తాడూరి బాలకృష్ణ మహోపాధ్యాయుడు తన సొంత స్థలంలో ఆవిష్క రింప జేశారు. గుంటూరు వాసులు సంగా వెంకటనారాయ శర్మ ఆదిలక్ష్మీ దంపతులు, పెద్దపల్లి, కరీంనగర్ లో జరిగిన ప్రవచనాల్లో శాస్త్రి ప్రవచనాలను 2005లో శాస్త్రి కుమారుడు రామచంద్రుడు టేపులను సీడీలు, క్యాసెట్లుగా రూపొందించారు. ఇందులో ఉప్పుల రాధాకృష్ణ కృషి చాలా ఉంది. పలుమార్లు కాశీలో కూడా ప్రవచనం చేసిన శాస్త్రిచే కరీంనగర్ వీరాంజనేయ స్వామి దేవాలయంలో మంగళంపల్లి మురహరిశర్మ భాగవత సప్తాహం చేయించారు. శాస్త్రి ప్రవచనాలను 50 మంది లబ్ద ప్రతిష్టులు, శాస్త్రి బంధువులు రాసిన అభిప్రా యాలు, వ్యాసాలతో మనుమడు విష్ణుప్రసాద్ సతీమణి డాక్టర్ వారిజా రాణి సంపాదకురాలిగా, మరో మనుమడు గుండి విష్ణుప్రసాద్ ప్రేరణతో ఎం. శేషాచలం అండ్ కంపని "ఎమెస్కో" ఓ పుస్తకం ప్రచురించింది. ఇంకా ఎందరిదో కృషి ఫలితంగా ఈ మహానీయుని చరిత్ర వెలుగు చూసింది. 30 మే 1975లో 82వ యేట శాస్త్రి బ్రహ్మలీనులైనారు. 1968లో జర్మనీ యువతి శాస్త్రిని సత్కరించి ప్రవచనాలను ఇంగ్లీషులో తర్జుమా చేయించుకొని సంస్కృతం నేర్చుకొంది. ఇంగ్లాండ్ ఎంపీ హ్యాస్ బ్రిటీష్ ప్రభుత్వ ప్రతినిధిగా వచ్చి ప్రవచానాన్ని విని భారత దేశ ధార్మిక ప్రవృత్తి గొప్పదని కొనియాడారు. ధర్మపురి సంస్కృతాంధ్ర కళాశాలకు శంకుస్థాపన చేయగా వేలాది ఉభయ భాషా పండితులకు కల్పతరువై విరాజిల్లుతోంది. ప్రాక్పశ్చిమ ఉత్తర దక్షిణ యాత్రలను సంపూర్ణంగా కాలినడకన పూర్తి చేశారు. జిల్లాకు ఒకప్పటి ముస్లిం కలెక్టర్‌కు ఉర్దూ పారశీక భాషల్లో భాగవత శ్లోకాలు అర్థతాత్పర్యాదులతో వివరించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రులు బూర్గుల రామ్మృష్ణారావు, మర్రి చెన్నారెడ్డి, దామోదరం సంజీవయ్య, కెవీ కేశవులు, కవిసామ్రాట్ విశ్వనాథ, జువ్వాడి గౌతంరావు, జువాడి చొక్కారావు, తెన్నేటి విశ్వనాథం, కాసుగంటి నారాయణరావు, దివాకర్ల వెంకటావధాని, జువ్వాడి రత్నాకర్ రావు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, వానమమాలై వరదాచార్యులు, మల్లాది, మార్కండేయశాస్త్రి, వేమూరి లక్ష్మీ నరహరి శాస్త్ర, వంటివారు ఆయన పురాణానికి శ్రోతలుగా పలు సందర్భాలలో శాస్త్రి స్వగృహానికి ఎతెంచి పురాణ శ్రవణం చేసి, పలు సందేహాలు నివృత్తి చేసుకున్నా రంటే గొప్పతనం కాక మరేమిటి. కరపాత్ర స్వామీజీ, శృంగేరీ, కంచి, కామకోటీ, పుష్పగిరి పీఠాధిపుతులు, మధ్వ పీఠాధిపతులు, తలపాక మహారాజు, త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ పెద్ద జీయర్ స్వామి వంటి వారు ధర్మపురిని సందర్శించినపుడు శాస్త్రి ప్రవచనాలు విని అభినందించి సన్మానించారు. కరీంనగర్ కాంగ్రెస్ కురు వృద్దులు మాజీ ఎంపీ, మాజీ మంత్రి జువ్వాడి చొక్కారావు ఇల్లు కట్టిస్తానన్నా, కాసుగంటి నారాయణరావు కొండగట్టు పై 200 ఎకరాల భూమిని రాసిస్తానన్నా, మానకొండూర్ సర్పంచ్ సదాశివరావు తన భూమినంతా దానం చేస్తానన్నా, నాయకులు రాష్ట్రపతి పురస్కార మిప్పిస్తా మన్నా సున్నితంగా తిరస్కరించిన ఉదాత్తుడు రాజన్న శాస్త్రి.

## నిర్లక్ష్యానికి భారీ మూల్యం...

ప్రాణం పోయాల్సిన ఆసుపత్రులు, వినోదాన్ని అందించాల్సిన ప్లేజోన్లు చిన్నారుల ప్రాణాలను బలిగొనడం అత్యంత విషాదకరం. పుట్టే బిడ్డ కోసం కలలు కనని, పుట్టిన బిడ్డ ఎదుగుదలను చూడాలని తపన పడని తల్లిదండ్రులు ఎక్కడా కనిపించరు. వారికి చిన్న ముల్లు గుచ్చుకుంటేనే తల్లడిల్లిపోతాం. అలాంటిది బూడిదకుప్పలా మారారంటే ఆ తల్లుల, తండ్రుల, కుటుంబాల శోకాన్ని తీర్చగలిగే వారెవరు? అభివృద్ధి నమూనాగా ఊదరగొడుతున్న గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో తొమ్మిదిమంది చిన్నారులుసహా 28 మంది బూడిద కుప్పగా మారడం, డిఎన్ఎ ఆధారంగా వారిని గుర్తించాల్సిన దుస్థితి రావడం ఘోరం. అదే రోజు ఢిల్లీలోని వివేక్ విహార్‌లోని బాలల ఆసుపత్రిలో ఏడుగురు నవజాత శిశువులు సజీవ దహనమయ్యారు. గంటల వ్యవధిలో జరిగిన ఈ రెండు ఘటనలు యావత్ దేశాన్ని కలచివేశాయి. రాజ్‌కోట్‌లోని టిఆర్‌పి గేమింగ్ జోన్‌లోని మొదటి ఫ్లోర్ పైకప్పునకు వెల్డింగ్ పనులు చేస్తుండగా.. ఆ నిప్పురవ్వలు పెట్రోలు డబ్బాలు లేదా ప్లాస్టిక్ లాంటి వస్తువులపై పడి మంటలు చెలరేగినట్లు సిసి టివి కెమెరాల్లో రికార్డయిన వీడియో ద్వారా తెలుస్తోంది. ఈ ఘటనపై సుమోటాగా విచారించిన గుజరాత్ హైకోర్టు మున్సిపల్ కార్పొరేషన్, రాష్ట్రప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడింది. తగిన అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోలేదంటూ రాష్ట్రప్రభుత్వ న్యాయవాది చెప్పడంపై ఆగ్రహించింది. 'మీ పరిధిలో అంత నిర్మాణం వెలిస్తే మీరు కళ్లు మూసుకుని ఉన్నారా? నిద్రపోతున్నారా? గత మూడున్నరేళ్లగా అక్కడ గేమింగ్ జోన్ నడుస్తుంటే ఆ విషయం మీకు తెలియదా? అగ్నిమాపక అనుమతుల కోసం వారు దరఖాస్తు చేసుకున్నారా? అక్కడికి వెళ్లే వారికి ఇచ్చే టికెట్లపై వినోదం పన్ను (మున్సిపాల్టీకి చెల్లించే పన్ను) వసూలు చేస్తారు. అదైనా మీకు తెలుసా?' అని ప్రశ్నలు కురిపించింది. బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలంటూ మరో న్యాయవాది చేసిన వాదనను కొట్టిపారేస్తూ 'ఎవరు కఠిన చర్యలు చేపడతారు? రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం మీద మాకు నమ్మకం పోయింది. నాలుగేళ్ల క్రితం మేం ఆదేశాలు జారీ చేశాం. వాటి అమలుకు రాష్ట్రప్రభుత్వం హామీ ఇచ్చింది. తాజా ఘటనతో కలిపి ఆరు అగ్ని ప్రమాదాలు జరిగాయి. ప్రాణాలు పోయిన తరువాతే అధికారులు రంగంలోకి దిగుతున్నారు. దీనినిబట్టి ప్రాణాలు పోవాలని కోరుకుంటున్నట్టున్నారు?' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీలోని వివేక్ విహార్‌లో ఉన్న బేబీకేర్ న్యూ బార్న్ ఆసుపత్రిలో ఆక్సిజన్ సిలిండర్ పేలడం నవజాత శిశువుల మరణానికి కారణమని చెబుతున్నారు. ఆ ఆసుపత్రి ఢిల్లీ నర్సింగ్ హోం నమోదు చట్టం కింద నమోదే కాలేదట. దాని యజమాని డాక్టర్ నవీన్‌పై క్రిమినల్ కేసులు సైతం ఉన్నాయి. 2021లో నమోదైన కేసులో ముందస్తు బెయిల్‌పై ఉన్నారు. ఈ రెండు ఘటనల్లోనూ ప్రమాదాలను నివారించడానికి, ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కాపాడటానికి అవసరమైన కనీస నదుపాయాలే మృగ్యమయ్యాయి. అగ్నిమాపక పరికరాలు, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లే మార్గాలు, సహాయక చర్యలు చేపట్టేందుకు శిక్షణ పొందిన సిబ్బంది లేరు.

# విలక్షణ ప్రదేశం గోవా.....!




భారతదేశ అరేబియన్ నైరుతి తీరప్రాంత గోవా రాష్ట్రం దక్కన్ పీఠ భూమిగా పశ్చిమ కనుమలతో వేరు చేయబడి ఉంది. 'పనాజీ' కేంద్రంగా కోంకన్ అధికారిక భాష మాట్లాడే గోవా ప్రాంతం ప్రకృతి రమణీయతలకు, బీచ్‌ల కమనీయ విందులకు ప్రసిద్ధి గాంచింది. ఉత్తరాన మహారాష్ట్ర, పశ్చిమ, దక్షిణాన కర్నాటక, పశ్చిమాన సముద్ర తీరప్రాంతంగా పర్యాటకులకు స్వర్గతుల్యంగా నిలుస్తున్నది. భారత్ 15 ఆగష్టు 1947న స్వాతంత్ర్యం పొందినప్పటికీ గోవా మాత్రం పోర్చుగీస్ పాలనలోనే కొనసాగింది. 450 ఏండ్ల పోర్చుగీస్ పాలన అనంతరం 19 డిసెంబర్ 1961న భారత ప్రభుత్వం నిర్వహించిన 'ఆపరేషన్ విజయ్' త్రివిధ దళాల దాడితో 36 గంటల్లోనే డమన్, డయ్యూ ద్వీపాలతో పాటు గోవా కూడా విముక్తమై కేంద్రపాలిత ప్రాంతాలుగా భారత దేశంలో అంతర్భాగం అయ్యాయి. 30 మే 1987న భారత ప్రభుత్వం గోవాకు (25వ రాష్ట్రంగా) రాష్ట్ర హోదాను ఇవ్వడంతో డయ్యూ, డమన్‌లు మాత్రం కేంద్ర పాలిత ప్రాంతాలుగానే మిగిలి పోవలసి వచ్చింది. వైశాల్యంలో అతి చిన్న రాష్ట్రంగా, జనాభాలో నాలుగవ చిన్న రాష్ట్రంగా గోవా అరేబియా సముద్ర ఒడ్డున ఉన్నది. దేశంలోనే అత్యధిక 'పర్ కాపిటా జిడిపి' ( దేశంలో 2.5 రెట్లు అధికంగా) కలిగిన రాష్ట్రంగా గోవా ఉన్నత స్థితిలో ఉంది. ఉన్నత జీవన ప్రమాణాలతో అధిక మౌళిక వసతులు కలిగిన గోవాలో 65 మైళ్ల తీరప్రాంతంతో పాటు అందమైన బీచ్‌లు, విదేశీ పర్యాటకులకు స్వర్గతుల్యంగా ప్రసిద్ధిగాంచింది. కోంకన్ ప్రాంతంగా పిలువబడే గోవా రాష్ట్రం 30 మే 1987 నుంచి 'రాష్ట్ర అవతరణ దినోత్సవాలను' ఘనంగా నిర్వహించుట జరుగుతున్నది. గోవా ప్రాంతంలో జువారీ, మండోవి, తెరెకోల్, చపోర, గల్గిబాగ్, కుంబర్జువా కెనాల్, తల్పోన, సాల్ అనబడే ఏడు నదులు ప్రవహిస్తున్నాయి. అతి పెద్ద పట్టణంగా వాస్కోడెగామ ఉండగా గోవా రాష్ట్రం రెండు జిల్లాలుగా విస్తరించింది. గోవా రాష్ట్ర జనాభా 15.22 లక్షలు ఉంటుంది. హిందువులు, క్రిస్టియన్లు అధికంగా ఉన్న గోవాలో ముస్లిమ్‌లు, సిక్కులు, జైనులు కూడా కొద్ది జనాభా ఉంది. కోంకణి, మరాఠీ, ఆంగ్ల భాష అధికంగా మాట్లాడే గోవాలో వ్యవసాయం ప్రధాన జీవనోపాధిగా ముందుకు దూసుకెలుతున్నది. ఖనిజ సంపద అధికంగా ఉన్న గోవాలో పారిశ్రామిక ప్రగతి కూడా చెప్పుకోదగినదే. కొబ్బరి తోటల నీడన బీచ్‌లు, స్వర్ణమయ ఇసుక తిన్నెలు, ఆకు పచ్చ పరిసరాలు, వైవిధ్య భరిత సాంస్కృతిక వారసత్వ విలక్షణతలు, అద్భుత పురాతన చర్చిలు, దేవాలయాలు, కోటలు, పోర్చుగీస్ కళానైపుణ్య స్మారక కట్టడాలు, తూర్పు-పడమరల సాంస్కృతిక మేలుకలయికలతో గోవా ప్రముఖ రాష్ట్రంగా, 'వరల్డ్ హెరిటేజ్ సైట్'గా కూడా గుర్తించబడి దేశ విదేశీ పర్యాటకులను ఆకర్షిస్తున్నది. 'పర్యాటకుల సర్గం'గా కొనియాడబడే గోవా ప్రత్యేకతల్ని ఆస్వాదిస్తూ, ఆధునికత పేరున సాంస్కృతిక విధ్వంసం, వారసత్వ సంపదకు విఘాతం కలుగకుండ కాపాడుకోవలసిన బాధ్యత మనందరి మీద ఉన్నది. 450 ఏండ్ల పోర్చుగీస్ పాలన అనంతరం 19 డిసెంబర్ 1961న భారత ప్రభుత్వం నిర్వహించిన 'ఆపరేషన్ విజయ్' త్రివిధ దళాల దాడితో 36 గంటల్లోనే డమన్, డయ్యూ ద్వీపాలతో పాటు గోవా కూడా విముక్తమై కేంద్రపాలిత ప్రాంతాలుగా భారత దేశంలో అంతర్భాగం అయ్యాయి. 30 మే 1987న భారత ప్రభుత్వం గోవాకు రాష్ట్ర హోదాను ఇవ్వడంతో డయ్యూ, డమన్‌లు మాత్రం కేంద్ర పాలిత ప్రాంతాలుగానే మిగిలి పోవలసి వచ్చింది.

# కెనడాలో భారతీయుల నిరాహార దీక్ష....?




కెనడాలోని ప్రిన్స్ ఎడ్వర్డ్ ఐలాండ్(పీఈఐ) స్థానిక ప్రభుత్వం విదేశీ కార్మికులను తగ్గించాలని తీసుకున్న నిర్ణయంతో అక్కడ పని చేస్తున్న భారతీయుల్లో ఆందోళన నెలకొంది.దీంతో ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా చార్లెస్ టౌన్‌లో భారతీయులు నిరాహార దీక్ష చేపట్టారు. అయితే మూడు రోజుల నుంచే ఈ కార్యక్రమం చేపడుతున్నప్పటికీ ఇక నుంచి సంపూర్ణ నిరాహార దీక్ష చేయనున్నట్టు తాజాగా ప్రకటించారు. ద్రవ పదార్థాలు కూడా తీసుకోమని స్పష్టం చేశారు. ఇమ్మిగ్రేషన్ నిబంధనల్లో మార్పుల కారణంగా సుమారు 50 మంది కార్మికులు ఇప్పటికే కెనడాను విడిచిపెట్టారని, మరి కొందరు నిరసనకారులు వేధింపులను ఎదుర్కొన్నారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. భారత కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని నిరసన కారులు హెచ్చరించారు. వలస కార్మికుల సంఖ్యను 2,100 నుంచి సుమారు 1,600కి తగ్గించాలని ప్రిన్స్ ఎడ్వర్డ్ ఐలాండ్ ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకుంది. అంతేగాక శాశ్వత నివాస సంఖ్యను కూడా 25 శాతం తగ్గించనున్నట్లు తెలిపింది. నామినేట్ చేసే సేల్స్, సర్వీస్ వర్కర్ల సంఖ్యను 2023లో 800 ఉండగా..ప్రస్తుతం 200కి తగ్గించింది. ఇది ప్రాంతీయ నామినీ ప్రోగ్రామ్‌లో విదేశీ నామినీల సంఖ్యను కూడా తగ్గిస్తుంది. మారిన విధానం ప్రకారం రాబోయే వలసదారుల సంఖ్యను తగ్గించాల్సి ఉన్నందున నిర్మాణం, ఆరోగ్య సంరక్షణ వంటి కొన్ని రంగాలకు అనుకూలంగా ఉంటుంని ప్రభుత్వం తెలిపింది. ఇటీవలి సంవత్సరాలలో ప్రావిన్స్‌లో రికార్డు స్థాయిలో పెరిగిన జనాభాను నియంత్రించడానికి వలసలను తగ్గించాల్సిన అవసరం ఉందని పీఈఐ ప్రభుత్వం వెల్లడించింది. జనాభా పెరుగుదల గృహ సంక్షోభానికి దోహదపడిందని, ప్రావిన్స్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థపై కూడా ఒత్తిడి తెచ్చిందని అభిప్రాయపడింది. దీంతో ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ విదేశీయులు నిరసనలకు దిగారు. ఈ మార్పులు సేవా పరిశ్రమతో పాటు యజమానులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయని చెబుతున్నారు.


# సుప్రీంకోర్టును కూల్చొద్దు....!



న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు భవనాన్ని కూల్చవద్దని కేంద్రప్రభుత్వంతోపాటు కోర్టు రిజిస్ట్రీకి ఆదేశాలివ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది. భారీ కట్టడాన్ని కూల్చివేసే బదులు వేరే చోట కొత్త భవనాన్ని నిర్మించాలని, ప్రస్తుతం ఉన్న భవనాన్ని ఇతర అవసరాలకు వాడుకోవచ్చని పిటీషనర్ తెలిపారు. ”స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో నిర్మించిన ముఖ్యమైన కట్టడాల్లో సుప్రీంకోర్టు ఒకటి. దీన్ని కూల్చివేస్తే చరిత్రలో ఒక భాగాన్ని నాశనం చేసినట్లే అవుతుంది. ప్రస్తుతం అద్దె ప్రాతిపదికన ప్రైవేటు ప్రాంతాల్లో కొనసాగుతోన్న అనేక కోర్టులు, ట్రైబ్యునళ్లు, ప్రభుత్వ కార్యాలయాలకు ఇక్కడ వసతి కల్పించవచ్చు’ అని పిటిషనర్ పేర్కొన్నారు. ఇప్పటివరకు కొత్త భవనానికి సంబంధించిన నమూనాను కూడా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు విడుదల చేయలేదని, ప్రజలతో పాటు బార్ అసోసియేషన్‌లతోనూ దీనిపై చర్చించలేదన్నారు. ”ప్రస్తుతం 17 కోర్టు రూమ్‌లు, రెండు రిజిస్ట్రీ రూమ్‌లు ఉన్నాయి.

ఈ మొత్తం భవనాన్ని కూల్చివేసి రూ.800 కోట్లతో కొత్త భవనం నిర్మించాలని యోచిస్తున్నారు. ఇందులో 27 కోర్టు రూమ్‌లు, నాలుగు రిజిస్ట్రీ రూమ్‌లు నిర్మించేందుకు కేంద్రప్రభుత్వం ప్రణాళికలు వేసింది. సుప్రీంకోర్టులో కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నందున పదేళ్ల తర్వాత ఇవి కూడా సరిపోవు” అని కెకె రమేష్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

## ఈ విధ్వంసాన్ని ఆపాలి.. ఇజ్రాయెల్‌కు యూఎన్ వార్నింగ్



రఫాపై ఇజ్రాయెల్ దాడిపై ప్రపంచ దేశాల నుంచి వ్యతిరేకత ఎదురైంది. ఇజ్రాయెల్ దాడిలో 45 మంది చనిపోయారు. ఐక్యరాజ్యసమితి ఇజ్రాయెల్ చర్యలపై తీవ్రస్థాయిలో మండిపడింది. ఈ విధ్వంసాన్ని ఆపాలని ఇజ్రాయెల్ కు ఐక్యరాజ్యసమితి వార్నింగ్ ఇచ్చింది. ఇజ్రాయెల్ దాడిని సామాన్యులపై జరిగిన ఘోరం అని ఐక్యరాజ్యసమితి అభివర్ణించింది. ఇజ్రాయెల్ చర్యలను ఖండిస్తున్నామని ప్రకటించింది. గాజాలో అసలు సురక్షితమైన ప్రాంతమే లేదని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా యూఎన్ ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటారెస్ తెలిపారు. ఈ విధ్వంసాన్ని వెంటనే ఆపాలని ఇజ్రాయెల్ ను కోరారు. రఫాలో ఆదివారం రాత్రి ఇజ్రాయెల్ దారుణమైన దాడులకు పాల్పడింది. ఈ ఘటనలో 45 మంది పాలస్తీనియన్లు చనిపోయారు. 200 మందికిపైగా గాయపడ్డారు. ఈ దాడిని భీకర దాడి అని ప్రపంచ దేశాలు పేర్కొన్నాయి.దాడి జరిగిన తల్ అల్ సుల్తాన్ ప్రాంతాన్ని సురక్షితమైనదిగా ఇజ్రాయెలే ప్రకటించింది. దీంతో చాలా మంది ఇక్కడకు వచ్చి తలదాచుకుంటున్నారు. ఇప్పుడు ఆ ప్రాంతంపైనే దాడి చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. దాడి గురించి చూస్తే.. ఇజ్రాయెల్ తీరులో మార్పు రాలేదని తెలుస్తోంది అని యూఎన్ మానవ హక్కుల విభాగం హై కమిషనర్ వోల్కర్ టర్క్ అన్నారు. అసలు గాజాలో సురక్షితమైన ప్రాంతమే లేదన్నారు. సామాన్యులు ఉన్న అలాంటి ప్రాంతంపై దాడి చేస్తే ఎలాంటి పరిణామాలు ఉంటాయో ఇజ్రాయెల్ కు తెలుసన్నారు. కాల్పుల విరమణను పాటించాలని రెండు దేశాలకు సూచించారు. ఖైదీలుగా ఉన్నవారిని వెంటనే విడుదల చేయాలన్నారు.


# 10 ఏళ్లలో 60 వేల మంది తగ్గారు

**అదిలాబాద్, మే :** తెలంగాణ సిరుల గని సింగరేణిలో ఒకప్పుడు లక్షకు పైగా కార్మికులు పనిచేసేవారు. అలాంటిది సింగరేణిలో బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కార్మికుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. రాష్ట్రంలో సింగరేణి పరిధి వ్యాప్తంగా అన్ని ప్రాంతాలలో కార్మికుల సంఖ్య దాదాపు 40 వేలకు పడిపోయింది. బీఆర్ఎస్ హయాంలో గడచిన 5 సంవత్సరాలలో బాగా తగ్గుముఖం పట్టింది. కొత్తగా నియామకాలు చేపట్టకపోగా..కార్మికుల సంక్షేమ పథకాలన్నీ అటకెక్కించేశారు. దీనితో ఉన్న కార్మికులే వేరే ఉద్యోగాలు వెదుక్కునే పరిస్థితి కల్పించారు బీఆర్ఎస్ నేతలు. దీనితో ప్రతిష్టాత్మక సింగరేణి సంస్థ మనుగడకే ప్రమాదం వాటిల్లే పరిస్థితి వచ్చింది. శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల పరిధిలో ఐదేళ్ల క్రితం సుమారు 21 వేల మంది ఉన్న కార్మికులు ప్రస్తుతం 14 వేలకు చేరారు. అయితే తెలంగాణలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి విస్తరణపై దృష్టి పెట్టింది. కాస్ట్‌లో పంప్డ్‌స్టోరేజీ హైడ్రో పవర్ ప్లాంట్‌తో పాటు సింగరేణి విస్తరించిన ఆరు జిల్లాల్లో ఓపెన్ కాస్ట్ మట్టి గుట్టలపై విండ్ పవర్ ఉత్పత్తి చేసేందుకు ఫోకస్ చేసింది. ఈ విషయాలపై సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి రిపోర్ట్ ఇచ్చారు. పార్లమెంట్ రిజల్ట్ అనంతరం ప్రభుత్వ నిర్ణయం వెలువడే అవకాశం ఉంది.దాదాపు ఆరు జిల్లాలలో విస్తరించిన సింగరేణి సంస్థ మొదట్లో బొగ్గు ఉత్పత్తి, రవాణాపైనే ఫోకస్ పెట్టింది. 2016లో జైపూర్ ప్లాంట్ లో రెండు యూనిట్ల ద్వారా 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించింది. తర్వాత మొదటి దశలో తొమ్మిది ప్రాంతాలలో 13 సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసి 235 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని చేస్తున్నారు. రెండో దశలో భాగంగా 232 మెగావాట్ల సోలార్ పవర్ ను ఉత్పత్తి చేసేందుకు వీలుగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా మందమర్రిలో 67.5 మెగావాట్ల ప్లాంట్, రామగుండం పరిధిలోని ఓవర్ బర్డెన్ డంప్ లో 37 మెగావాట్ల ప్లాంట్, శ్రీరాంపూర్ ప్రాంతంలో 27.5 మెగావాట్ల ప్లాంట్, కొత్తగూడెంలో 32.5 మెగావాట్ల ప్లాంట్, జైపూర్ సింగరేణి



థర్మల్ పవర్ సెంటర్ ఆవరణలో 32.5 మెగావాట్ల ప్లాంట్, ఇల్లందులో 37.5 మెగావాట్ల ప్లాంట్ ను నిర్మాణం చేయనున్నారు. ఇక జైపర్ వవర్ ప్లాంట్ ను విస్తరించడంలో భాగంగా రెండో దశలో 800 మెగావాట్ల మూడవ యూనిట్ ను నిర్మించేందుకు ఇప్పటికే శంకుస్థాపన చేశారు. ప్లాంట్ ఆవరణలోనే రూ.5,900 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్నారు.సంస్థ ఉత్పత్తి పెరిగినప్పటికీ కార్మికుల సంఖ్య అధికంగా ఉందన్న నెపంతో బీఆర్ఎస్ సూచనల ప్రకారం సంస్థ యాజమాన్యం కార్మికులను తగ్గించే పన్నాగం పన్నింది. గోల్డెన్ షేక్‌హ్యాండ్ పథకాన్ని తెరపైకి తేవడం ద్వారా సర్వీసు మిగిలి ఉండగానే కార్మికులను ముందస్తుగా ఉద్యోగాల్లో నుంచి తొలగించే ప్రక్రియకు నాంది పలికింది. అలా ప్రారంభమైన కార్మికుల ఏరివేత కారణంగా సింగరేణి వ్యాప్తంగా వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. బొగ్గు ఉత్పత్తిపై సింగరేణి యాజమాన్యం చూపుతున్న శ్రద్ధ సంస్థ మనుగడపై చూపడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. అండర్ గ్రౌండ్ గనులను క్రమంగా మూసి వేస్తున్న యాజమాన్యం, వాటి స్థానంలో ఓపెన్‌కాస్టు గనులను తెరపైకి తెచ్చింది. . రామకృష్ణాపూర్ ఓసీ మూతవేతకు సిద్ధంగా ఉండగా, దాని జీవితకాలం పెంచే అవకాశంపై బీఆర్ఎస్ ఏనాడూ దృష్టి సారించలేదు.

# పాశ్చాత్య ఆయుధాలు రష్యాను తాకితే తీవ్ర పరిణామాలు



పాశ్చాత్య దేశాల ఆయుధాలతో ఉక్రెయిన్ రష్యాపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని పుతిన్ హెచ్చరించారు. రష్యాపై అటాక్ చేయడానికి చేయడానికి పాశ్చాత్య ఆయుధాలను ఉపయోగించాలని ఐరోపాలోని నాటో సభ్యులు ప్రతిపాదించారని తెలిపారు. అక్కడి నాటో సభ్యులు నిప్పుతో ఆటలాడుతున్నారని, ఇది ప్రపంచ సంఘర్షణను మరింత ప్రేరేపించగలదని చెప్పారు. ఉజ్బెకిస్తాన్‌లో పర్యటనలో ఉన్న పుతిన్ తాష్కెంట్‌లో మీడియాతో మాట్లాడారు. యూరోపియన్ దేశాలు చిన్న భూభాగం, దట్టమైన జనాభా కలిగి ఉన్నాయని..రష్యా భూభాగంలో దాడి చేయడంపై మాట్లాడే ముందు వారు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. ఉక్రెయిన్ బలగాలు దాడికి పాల్పడినప్పటికీ, వారికి ఆయుధాలు సరఫరా చేస్తున్న పాశ్చాత్య దేశాలే దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పాశ్చాత్య సైనికులు ఇప్పటికే ఉక్రెయిన్ లో రహస్యంగా పనిచేస్తున్నట్టు తాను నమ్ముతున్నానని తెలిపారు. యూరప్ లోని చిన్న దేశాలు ఎవరితో ఆడుకుంటున్నాయో తెలుసుకోవాలని వార్నింగ్ ఇచ్చారు. ఉక్రెయిన్‌కు సైనిక శిక్షకులను పంపడంపై ఫ్రాన్స్‌తో చర్చలు జరుపుతున్నట్లు ఉక్రెయిన్ టాప్ కమాండర్ తెలిపారు. దీనిపై పుతిన్ స్పందిస్తూ.. ఉక్రెయిన్ భూభాగంలో ఎవరు ఉన్నా సరైనది అని మేము భావిస్తున్నామని తెలిపారు. ఫ్రెంచ్ దళాలను ఉక్రెయిన్‌కు పంపడం కూడా ప్రపంచ సంఘర్షణకు ఒక అడుగు ముందుకు వేసినట్టేనని తేల్చి చెప్పారు. కాగా, రష్యా సైనిక స్థావరాలను తటస్థీకరించడానికి కీవ్‌ను అనుమతించాలని ఫ్రెంచ్ అధ్యక్షుడు మాక్రాన్ ఇటీవల వ్యాఖ్యానించారు. అలాగే రెండేళ్ళకు పైగా యుద్ధం తర్వాత రష్యాపై దాడులను వేగవంతం చేసేందుకు ఉక్రెయిన్ తమ ఆయుధాలను ఉపయోగించేందుకు అనుమతించాలని కొంతమంది నాటో సభ్యులు కూటమి చీఫ్ జెన్స్ స్టోల్టెన్‌బర్గ్‌కు విన్నవించారు.

# లాహోర్ ఒప్పందాన్ని పాక్ ఉల్లంఘించింది

భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి హయాంలో కుదుర్చుకున్న లాహోర్ ఒప్పందాన్ని తమ దేశం ఉల్లంఘించిందని పాకిస్థాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ అంగీకరించారు. తన పార్టీ పీఎంఎల్-ఎన్ సమావేశం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నవాజ్ మాట్లాడారు. ‘1998 మే 28న పాకిస్థాన్ ఐదు అణుపరీక్షలు నిర్వహించింది. ఆ తర్వాత వాజ్‌పేయి ఇక్కడికి వచ్చి మాతో ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ మేము ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించాం. అది మా తప్పే’ అని వ్యాఖ్యానించారు. పాకిస్తాన్ సుప్రీంకోర్టు అనర్హుడిగా ప్రకటించిన తర్వాత పీఎంఎల్-ఎన్ జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ‘పాకిస్థాన్‌ను అణు పరీక్షలు చేయకుండా ఆపేందుకు బిల్ క్లింటన్ 5 బిలియన్ డాలర్లు ఆఫర్ చేశారు. కానీ నేను దానికి నిరాకరించాను. ఒక వేళ ఇమ్రాన్ ఖాన్ నా సీటులో ఉన్నట్లయితే, అతను క్లింటన్ ఆఫర్‌ను అంగీకరించి ఉండేవాడు’ అని చెప్పారు. 2017లో అప్పటి పాక్ ప్రధాన న్యాయమూర్తి సాకిబ్ నిసార్ తప్పుడు కేసుతో తనను ప్రధాని కార్యాలయం నుంచి తొలగించారని చెప్పారు. తనపై ఉన్న కేసులన్నీ అవాస్తవమని, ఇమ్రాన్ ఖాన్‌పై ఉన్న కేసులు నిజమని అన్నారు. కాగా, 1999



ఫిబ్రవరి 21న లాహోర్ అగ్రిమెంట్ జరిగింది. ఇది భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య కుదిరిన ద్వైపాక్షిక ఒప్పందం. దీని ప్రకారం.. అణు ఆయుధాల అభివృద్ధిని ప్రోత్సహించడం, ప్రమాదవశాత్తు లేదా అనధికారికంగా వాటిని వినియోగాన్ని నివారించడం వంటి అంశాలు ప్రధానమైనవి. దీనిపై అప్పటి పాక్ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్, భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయిలు సంతకం చేశారు. అయితే, కొన్ని నెలల తర్వాత జమ్మూ కశ్మీర్‌లోని కార్గిల్ జిల్లాలో పాకిస్థాన్ దళాలు చొరబడేందుకు ప్రయత్నించాయి. దీంతో ఇరు దేశాల మధ్య కార్గిల్ యుద్ధం జరిగింది.

# పర్యాటకానికి అంతరిక్షమే హద్దు...!


మన దేశంలో అంతరిక్ష పర్యాటకానికి ఎనలేని క్రేజ్ ఉంది. భారత దేశంలో చాలా మంది రోదసీ యాత్రలపై ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో 2030 నాటికి దేశంలో తొలిసారి అంతరిక్ష పర్యాటకం ప్రారంభించాలని ఇస్రో ఆలోచన చేస్తోంది. ఈ రోదసీ యాత్ర చేసివచ్చిన వారు తమను తాము వ్యోమగాములుగా పిలుచుకోవచ్చు. కాగా ప్రపంచంలో సామాజిక పరిస్థితులు శరవేగంగా మారుతున్నాయి. ఇటీవలికాలంలో పర్యాటకరంగం అభివృద్ధి చెందింది. ప్రజల్లో కొత్త ప్రదేశాలు చూడాలన్న ఆసక్తే తొలి రోజుల్లో పర్యాటక రంగానికి పునాదిగా ఉండేది. అయితే రానురాను దేశ కాలమాన పరిస్థితులు మారిపోయాయి. రకరకాల కారణాలతో ప్రజలు వేర్వేరు కొత్త ప్రదేశాలకు వెళ్లడం మొదలైంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా పర్యాటక రంగం పెరిగింది. అయితే ఇప్పుడు ప్రజల ఆలోచనా ధోరణి మారింది. ఏకంగా అంతరిక్షంలోకి సరదాగా ఓ ట్రిప్ వేయాలన్న కుతూహలం ప్రజల్లోపెరిగింది. ఈ నేపథ్యంలో భవిష్యత్తులో అంతరిక్ష పర్యాటకం సర్వసాధారణం అవుతుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. తెలుగువాడి కీర్తి మరోసారి విశ్వవ్యాప్తమైంది. తెలుగు వ్యక్తి తోటకూర గోపీచంద్ విజయవంతంగా అంతరిక్ష యాత్రను పూర్తి చేశారు. గోపీచంద్ ఒక పర్యాటకుడిగా అంతరిక్షంలోకి అడుగుపెట్టి వచ్చారు. ఈ సందర్భంగా అంతరిక్ష పర్యాటకం హాట్ టాపిక్ అయింది. అంతరిక్ష పర్యాటకం అనేది ఒక కలలాంటిది. అయితే అసలు ఈ కల సాకారమవుతుందా లేదా అనే ప్రశ్న కూడా గతంలో తెరమీదకు వచ్చింది. అయితే కాలక్రమంలో ఈ కలను సాకారం చేశాయి అంతరిక్షంతో ముడిపడ్డ అనేక కంపెనీలు. ఇది రాత్రికి రాత్రి జరిగింది కాదు. దీని వెనుక ఆయా సంస్థల రాత్రింబవళ్ల కష్టం ఉంది. అంతరిక్ష నిపుణుల స్వేదం ఉంది. వారి తెలివి అలాగే క్రియేటివిటీ ఉంది. ‘వర్జిన్ గెలాక్టిక్’ అమెరికాకు చెందిన ఓ ప్రైవేటు కంపెనీ. అదేదో సాదాసీదా కంపెనీ కాదు. రోదసీ యాత్రలు చేపట్టే ఓ అపురూప కంపెనీయే ‘వర్జిన్ గెలాక్టిక్’. 2004లో రిచర్డ్ బ్రాన్సన్ అనే సంపన్నుడు ‘వర్జిన్ గెలాక్టిక్ ’ పేరుతో ఒక స్పేస్ టూరిజం కంపెనీని స్థాపించాడు. 2021 జులై నెలలో ఓ రోదసీ యాత్ర నిర్వహించింది ‘వర్జిన్ గెలాక్టిక్. సంస్థ అధిపతి రిచర్డ్ బ్రాన్సన్‌తోపాటు మరో ఆరుగురు ‘విఎస్ఎస్ యూనిటీ– 22’ అనే వ్యోమనౌక ద్వారా వినువీధుల్లో విహరించారు. వినువీధుల్లో విహారం తరువాత సురక్షితంగా భూమి మీదకు తిరిగివచ్చారు. ఆన్‌లైన్ దిగ్గజ సంస్థ అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ బెజోస్‌కు కూడా అంతరిక్ష పర్యాటకంతో సంబంధం ఉంది. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ సైతం 2021లో తన సొంత వ్యోమనౌకలో రోదసీ యాత్ర చేశారు. జెఫ బెజోస్ నెలకొల్పిన కంపెనీ ‘బ్లూ ఆరిజిన్’ ఈ రోదసీ యాత్ర నిర్వహించింది. స్పేస్ ఎక్స్.. ఇది అంతరిక్ష పరిశోధనలకు సంబంధించిన సంస్థ. వివాదాస్పద కార్పొరేట్ దిగ్గజం ఎలన్ మస్క్ స్వంత సంస్థ ఇది. అంతరిక్షంపై తన ఆలోచనలకు అనుగుణంగా ఎలన్ మస్క్, స్పేస్ ఎక్స్ అనే సంస్థను ప్రారంభించాడు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా ఎలన్ మస్క్ పేరు మార్మోగింది. స్పేస్ ఎక్స్%ా% ఒక వినూత్న ప్రాజెక్ట్ అంటారు నిపుణులు. ప్రపంచ వ్యాప్తంగా అంతరిక్ష యాత్ర పరిధి మారుతోంది. అంతరిక్ష యాత్ర మరింత విస్తృతమవుతోంది. రోదసీ యాత్ర కాస్తా స్పేస్ అడ్వెంచర్ మోడల్‌గా అభివృద్ధి చెందుతోంది. అయితే కొన్ని కారణాలతో అందుకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ప్రస్తుతం రాకెట్ ప్రయోగం చాలా ఖరీదైన పరీక్షగా మారింది. కొన్నేళ్లుగా రాకెట్లలో ఉపయోగించే ఇంధనం అలాగే వనరుల ఖర్చు పెరిగింది. రోదసీ యాత్రలు విలాసవంతంగానే కాదు, సాహస యాత్రలుగానూ ఉంటాయి. రోదసీ యాత్రల్లో ప్రయాణీకుల భద్రతపై ఎక్కువ దృష్టి పెట్టాయి సదరు కంపెనీలు. సహజంగా టూరిజం అంటే అందరికీ ఆసక్తి ఉంటుంది. అయితే అంతరిక్ష పర్యాటకం అంటే మరింత ఆసక్తి ఉంటుంది. అయితే స్పేస్ టూరిజం అందరికీ అందుబాటులో ఉండదు. కేవలం కోటీశ్వరులకు మాత్రమే ఉంటుంది. అంతరిక్ష పర్యాటకానికి సంబంధించిన ధరలను సామాన్యులు ఏమాత్రం భరించలేరు. కేవలం సంపన్నులు అది కూడా కోటీశ్వరులు మాత్రమే రోదసీ యాత్ర టికెట్లు కొంటారు. సహజంగా అంతరిక్షంలోకి రానూపోనూ ఒక్కో టికెట్ ధర కోట్ల రూపాయల్లో ఉంటుంది. ‘వర్జిన్ గెలాక్టిక్’ కంపెనీ అమ్మిన అంతరిక్ష టికెట్ ఒక్కోటి భారతీయ కరెన్సీలో దాదాపు రూ. 1.86 కోట్లు. ‘వర్జిన్ గెలాక్టిక్’ కంపెనీ అమ్మిన రోదసీ టికెట్లను కొన్నవారిలో పలువురు హాలీవుడ్ సెలబ్రిటీలు ఉండటం విశేషం. ముందుగా రోదసీ యాత్ర అంటే ఏమిటో అర్థం చేసుకోవాలి. భూమి పైనుంచి దాదాపు తొంభై కిలోమీటర్ల ఎత్తు వరకూ వెళ్లి తిరిగి రావటాన్ని రోదసీలోకి వెళ్లి రావడంగా ప్రస్తుతం భావిస్తున్నారు. మౌలికంగా రోదసీ యాత్రలను అంతరిక్ష చట్టం నియంత్రిస్తుంది. అంతరిక్ష చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా రోదసీ యాత్రలకు అధికారులు అనుమతి ఇస్తారు. మన దేశంలో అంతరిక్ష పర్యాటకానికి ప్రారంభ దశలోనే బోలెడంత క్రేజ్ వచ్చింది. భారత దేశంలో చాలా మంది రోదసీ యాత్రలపై ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో 2030 నాటికి భారత దేశంలో తొలిసారి స్పేస్ టూరిజం ప్రారంభించాలని ఇస్రో యోచిస్తోంది. ఈ రోదసీ యాత్రలో ఒక్కో టికెట్ ధర దాదాపు ఆరు కోట్ల రూపాయలు ఉండే అవకాశముంది. ఈ యాత్ర చేసివచ్చిన వారు తమను తాము వ్యోమగాములుగా పిలుచుకోవచ్చు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పనులు పురోగతిలో ఉన్నాయని ఇస్రో చైర్మన్ సోమ్‌నాథ్ వెల్లడించారు. దేశంలో రోదసీ యాత్రలకు మంచి భవిష్యత్ ఉందంటున్నారు అంతరిక్షరంగ నిపుణులు. అంతరిక్ష యాత్ర.. నిస్సందేహంగా లాభదాయకమే అంటున్నారు.రానున్న రోజుల్లో అంతరిక్షయానం అనేది ఒక ప్రధాన ఆదాయ వనరుగా మారుతుందన్నారు నిపుణులు.

# విటమిన్లు పుష్కలంగా ఉండే ఈ కూరగాయ తొక్కను తప్పక తినండి



తొక్కే కదా అని చెత్తలో పడేస్తున్నారా? దీని ప్రయోజనాలు తెలిస్తే పొట్టలో వేస్తారు. ఇంతకీ ఏంటి అది అనుకుంటున్నారా? ఆలు అదేనండి బంగాళదుంప. దీన్ని దేశంలో ప్రతి ఒక్కరు తింటారు కానీ తొక్కను మాత్రం పడేస్తారు. ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న ఈ బెరడు ఎన్నో వ్యాధులను దూరం చేస్తుందట. ఇంతకీ ఆలు తొక్క చేసే ఆ హెల్ప్ ఏంటో తెలుసుకోండి.బంగాళదుంప తొక్కలు చాలా మేలు చేస్తాయి అంటున్నారు నిపుణులు. వీటిలో ఉండే ఫైటోకెమికల్స్ యాంటీఆక్సిడెంట్ క్లోరోజానిక్ యాసిడ్ వల్ల క్యాన్సర్ కు దూరంగా ఉండవచ్చట. అదనంగా రోగనిరోధక వ్యవస్థ, రక్త కొలెస్ట్రాల్, గుండెపోటు, చర్మం, జీర్ణవ్యవస్థ, కణితులు, కణితులు, మలబద్ధకం, అధిక రక్తపోటు, మధుమేహం, రక్తహీనత, ఎముకలు , అందమైన జుట్టు వంటి వాటికి ఎన్నో విధాలుగా ఉపయోగపడతాయి.మనం ఇప్పుడు తెలుసుకున్న అన్నీ వ్యాధులకు ఈ బంగాలదుంప తొక్కలు సమానంగా పని చేస్తాయి అంటున్నారు నిపుణులు. ఇందులో విటమిన్ సి, విటమిన్ బి, పొటాషియం, మెగ్నీషియం, యాంటీఆక్సిడెంట్లు, ఆక్సలేట్లు, ఫైబర్, ప్రొటీన్లు, మినరల్స్, విటమిన్ 6 విటమిన్ డి మొదలగు అన్నీ పోషకాలు లభిస్తాయి. అందుకే ఆలు తొక్కను తొక్కేయకుండా తినేయండి. ఇక వేయించిన బంగాళాదుంప తొక్కలు అయితే రుచిగా ఉంటాయి ఆరోగ్యం కూడా. తొక్క తీయకుండా కూర వండేటప్పుడు తొక్కను కూడా వండేయాలి. ఇక అతి సర్వత్రా వర్జయేత్ అనే విషయం తెలిసిందే కదా. సో లిమిట్ మస్ట్. ఎవరైనా దీర్ఘకాలిక అనారోగ్యంతో బాధపడుతుంటే, ఖచ్చితంగా వైద్యుల సలహా తీసుకొని వీటిని మీ డైట్ లో చేర్చుకోవాలి. ఎందుకంటే వయస్సు, వ్యాధి తీవ్రతలను బట్టి మీ వైద్యుడు మీకు సలహాలు ఇస్తారు అని గుర్తుపెట్టుకోండి. అదనంగా రోగనిరోధక వ్యవస్థ, రక్త కొలెస్ట్రాల్, గుండెపోటు, చర్మం, జీర్ణవ్యవస్థ, కణితులు, కణితులు, మలబద్ధకం, అధిక రక్తపోటు, మధుమేహం, రక్తహీనత, ఎముకలు , అందమైన జుట్టు వంటి వాటికి ఎన్నో విధాలుగా ఉపయోగపడతాయి.

## ఆలుగడ్డ ప్రయోజనాలు




ఏదైనా చిన్న ఫంక్షన్ అయినా పెద్ద ఫంక్షన్ అయినా కూరగాయల భోజనాల్లో ఆలుకర్రీ కచ్చితంగా ఉంటుంది. ఈ బంగాళదుంపకు ఫ్యాన్స్ ఎక్కువే ఉంటారు. బంగాళ దుంపలతో ఎలాంటి వంటలు అయినా వండవచ్చు.కూరలు, ఫ్రైలు ఏది వండినా సరే చాలా రుచిగా ఉంటాయి. ప్రపంచ వ్యాప్తంగా అందరూ ఎక్కువగా ఉపయోగించే వాటిల్లో బంగాళ దుంప ముందు వరుసలో ఉంటుంది. ఏ కాలంలో అయినా అతిగా ఇష్టపడి తినే వంటకం కూడా ఆలునే. మరి దీన్ని తినడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయో ఓ సారి చూసేద్దాం. బంగాళ దుంపల్లో అనేక రకాలైన పోషకాలు ఉన్నాయి అంటున్నారు నిపుణులు. పొటాషియం, విటమిన్ సి, డైటరీ, ఫైబర్‌లు పుష్కలంగా ఉంటాయట. ఆలూ తినడం వల్ల గుండె జబ్బులు, సడన్ డెత్ లు వచ్చే ఛాన్సులు చాలా తక్కువగా ఉంటుందని తేలిందట. ఈ దుంపలో అధిక మొత్తంలో ఫైబర్ కంటెంట్ అనేది ఉంటుంది కాబట్టి శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ని కంట్రోల్ చేస్తుంది. అంటే చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తే గుండె సమస్యలకు చెక్ పెట్టవచ్చు అన్నమాట.గుండె సంబంధిత సమస్యలతో బాధ పడేవారు రెగ్యులర్‌గా ఆలు గడ్డ తినడం వల్ల హార్ట్ సమస్యలు కొంత వరకు తక్కువ అవుతాయట. ఈ దుంపలో ఫైబర్ మాత్రమే కాదు కార్బోహైడ్రేట్లు, విటమిన్లు కూడా లభిస్తాయి. అవి శరీరానికి తక్షణ శక్తి ని అందిస్తాయి. ఆలు గడ్డలో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థ ను చక్కగా పని చేసేలా చేస్తుంది. దీంతో మల బద్ధకం, అజీర్తి వంటి సమస్యలు దూరం అవుతాయి. బంగాళ దుంపలు తినడం వల్ల చర్మం సమస్యలు కూడా రావు అంటున్నారు నిపుణులు. చర్మ సంరక్షణలోనూ బంగాళ దుంప మంచి పాత్ర పోషిస్తుందట.

## వీటిని తీసుకుంటే ఆరోగ్యాన్ని పాడుచేసుకున్నట్టే.....



తినే ఆహారమే ఆరోగ్యాన్ని డిసైడ్ చేస్తుంటుంది. మంచి ఆహారం వల్ల ఆరోగ్యంగా ఉంటారు. లేదంటే అనారోగ్య పాలు అవడం తప్పదు. ఇక మీరు తినే ఆహారం సమయానికి తినడం కూడా ముఖ్యమే.అంతేకాదు కొన్ని సమయాల్లో కొన్ని ఫ్రూట్స్, ఫుడ్ ను తీసుకోకపోవడమే బెటర్. లేదంటే మరింత సమస్యలు వస్తాయి. ఇక ఉదయమే ఏదైనా తినాలి అనిపిస్తుంటుంది. కానీ ఈ సమయంలో తినడానికి ఎలాంటి ఆహారం లేకపోతే కొందరు ఏకంగా ఫ్రూట్స్ తింటారు. మరి ఇందులో కొన్ని ఫ్రూట్స్ తినకూడదు అంటున్నారు నిపుణులు. ఇంతకీ అవేంటంటే.. నారింజ, ద్రాక్ష, నిమ్మకాయ వంటి సిట్రస్ పండ్లలో ఆమ్లత ఉంటుంది. కాబట్టి వీటిని ఉదయం ఖాళీ కడుపున తినకూడదు అంటున్నారు నిపుణులు. స్పైసీ ఫుడ్స్ జోలికి కూడా పోకూడదట. ఇవి కడుపు లైనింగ్ ను దెబ్బతీస్తాయి. దీని వల్ల అజీర్ణ సమస్య వస్తుంటుంది. కాబట్టి నో స్పైసీ ఫుడ్స్ ఉదయం అని ఫిక్స్ అవండి.కార్బోనేటెడ్ పానీయాలలో సోడా, చక్కెర శాతం ఎక్కువ ఉంటుంది. వీటిని ఖాళీ కడుపుతో తీసుకుంటే కడుపు ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు వస్తాయట. కాఫీ లేదంటే బ్లాక్ కాఫీలు ఉదయం తీసుకుంటే కడుపులో యాసిడ్ ను ఉత్పత్తి చేస్తాయి.దీని వల్ల గుండెలో మంట, అజీర్ణ సమస్యలు కూడా వస్తాయి. కాబట్టి వీటిని కూడా ఖాళీ కడుపుతో తీసుకోకూడదు. ఇక టమాటాలు తినడం చాలా మందికి ఇష్టం.

# ఈ సమస్యలు ఉన్నా కాఫీ తాగుతున్నారా?



ప్రపంచంలో టీ, కాఫీ లవర్స్ ఎక్కువగానే ఉంటారు. చాలా మందికి టీ, కాఫీలు తీసుకోకపోతే డే గడవదు. కొంతమందికి కాఫీ అంటే మరీ ఇష్టం. కొందరు ఏకంగా ఉదయమే బెడ్ కాఫీ తాగుతుంటారు. అయితే కాఫీ లిమిట్‌గా తాగితున్నారా లేదా?ఇష్ట కదా అని ఎక్కువ తీసుకుంటే మీ సంగతి అంతే అంటున్నారు నిపుణులు. కొన్ని వ్యాధులు ఉన్నవారు కాఫీని అస్సలు తాగకూడదట. మీకు మైగ్రేన్ ఉందా. అయితే కాఫీ జోలికి వెళ్లకండి. ఎందుకంటే ఇందులో కెఫిన్ శాతం ఎక్కువగా ఉంటుంది.కెఫెన్ ఎక్కువగా ఉండటం వల్ల మెదడు నరాలపై ప్రభావం చూపిస్తుంది. అలాగే రక్త ప్రసరణ కూడా మందగిస్తుంది అంటున్నారు నిపుణులు. అధిక మొత్తంలో కెఫిన్ శరీరంలోకి చేరితే.. మైగ్రేన్ మరింత ఎక్కువ అవుతుందట. మైగ్రేన్ మాత్రమే కాదు మీకు హై-బీపీ ఉంటే కూడా కాఫీ తాగకండి. కాఫీ తాగడం వల్ల రక్తపోటు స్థాయి మరింత పెరిగి అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. అలాగే కాఫీ తాగడం వల్ల ఒత్తిడి పెరుగుతుందట ఇలా జరిగితే.. బీపీలో హెచ్చుతగ్గులు ఉండొచ్చు.డయాబెటిక్ పేషెంట్లు కాఫీ తాగడం మానేయడమే ఉత్తమం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. కాఫీ తాగడం వల్ల డయాబెటిక్ రోగులకు అధిక రక్తపోటు వచ్చే అవకాశం ఉందట. రక్తంలో చక్కెర స్థాయి అసమత్యుల్యంగా ఉన్నవారు కూడా కాఫీ కి దూరంగా ఉండాల్సిందే.గర్భధారణ సమయంలో కూడా కాఫీ తాగడం మంచిది కాదు అంటున్నారు నిపుణులు. కాఫీలో ఉండే కెఫిన్ శాతం మీ శరీరంలోని రక్త ప్రసరణను ప్రభావితం చేసి.. కడుపులో పెరుగుతున్న పిండానికి రక్త సరఫరాలో అసమతుల్యతను ఏర్పడేలా చేస్తుందట. ఒత్తిడి ఉన్నవారు కూడా కాఫీ గురించి మర్చిపోవాలి. కాఫీని తాగడం అధికంగా తాగితే శరీరంలో కార్టిసోల్ హార్మోన్‌పై ప్రభావం పడుతుంది. తద్వారా ఒత్తిడి మరింత ఎక్కువ అవుతుందట.

# ఐస్‌క్రీమ్స్ ఎక్కువగా తింటున్నారా..?

పిల్లలైనా, పెద్దలైనా అందరూ ఐస్‌క్రీం తినడానికి ఇష్టపడతారు. వేసవి కాలంలో ఐస్‌క్రీం ఎక్కువగా తీసుకుంటారు. ఈ కాలంలో కొందరికి రోజూ ఐస్ క్రీమ్ తినడం అలవాటు. రోజూ ఐస్ క్రీం తీసుకోవడం వల్ల మీ ఆరోగ్యం పాడవుతుందని మీకు తెలుసా.

నిజానికి ఐస్‌క్రీమ్‌ను ఎక్కువ కాలం భద్రపరచడానికి చాలా హానికరమైన రసాయనాలను ఉపయోగిస్తారు. అటువంటి పరిస్థితిలో, అతిగా తినడం మీ ఆరోగ్యాన్ని పాడు చేస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఐస్ క్రీమ్ తినకూడదు.మీరు డయాబెటిస్‌తో బాధపడుతున్నట్లయితే, ఐస్‌క్రీం తినడం మానుకోండి. ఐస్ క్రీం తయారీలో చక్కెరను ఎక్కువగా ఉపయోగిస్తారు. అటువంటి పరిస్థితిలో ఇది మీ చక్కెర స్థాయిని అకస్మాత్తుగా పెంచడం ద్వారా మీకు సమస్యలను కలిగిస్తుంది. ఐస్ క్రీం ఎక్కువగా తీసుకోవడం వల్ల మీ గుండె ఆరోగ్యానికి కూడా హానికరం.




గుండెకు మంచిదని భావించని, గుండె సంబంధిత వ్యాధులకు ఆహ్వానం పలుకుతున్న ఇలాంటి అనేక రసాయనాలను ఇందులో వాడుతున్నారు. ఐస్ క్రీం ఎక్కువగా తీసుకోవడం మీ జీర్ణవ్యవస్థకు కూడా మంచిది కాదు. మీకు జీర్ణ సమస్యలు ఉంటే, మీరు ఐస్ క్రీం తినకుండా ఉండాలి. ఐస్ క్రీం రుచి చల్లగా పరిగణించబడుతుంది.

# మెరిసే చర్మం మీ సొంతం కావాలంటే



వేసవి, చలికాలం వచ్చిందంటే చాలు స్కిన్ డిఫరెంట్ గా అవుతుంటుంది. పగుళ్లు కూడా ఏర్పడతాయి. కొందరిలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటుంది. అటువంటి చర్మంపై మీరు ఎంత మాయిశ్చరైజర్‌ను అప్లై చేసినా ఫలితం మాత్రం శూన్యమే ఉంటుంది. మీరు శతకోటి ప్రయత్నాలు చేసినా సరే సమస్య పెరుగుతుంది కానీ తగ్గదు. ఇక ఖరీదైన క్రీములు వాడినా డబ్బులు వృదా అవుతుంటాయి. అటువంటి పరిస్థితిలో చర్మాన్ని రక్షించుకోవడం ఎలా ఎలా అటూ వివిధ రకాల ఆలోచిస్తుంటారు కానీ పచ్చి పాల గురించి ఆలోచించారా? ఎక్కువ టెన్షన్ తీసుకోకుండా జస్ట్ పాలతో కొన్ని సింపుల్ టిప్స్ యూజ్ చేయండి. దీనికోసం పాలలో ముంచిన మెత్తని కాటన్ ప్యాడ్ తీసుకోవాలి. పచ్చి పాలను క్లెన్సర్‌గా మార్చుకోవడానికి దానికి కొంచెం కాఫీ పౌడర్, సముద్రపు ఉప్పును కలపండి.

# ఎప్పుడూ అలసటగా ఉంటున్నారా..?



ఫుల్ గా తిన్నా, ప్రోటీన్ ఫుడ్ తీసుకున్నా ఎప్పుడు నీరసంగా నిద్ర మొహాల మాదిరి కనిపిస్తుంటారు కొందరు. మరి దీని వెనుక పెద్ద పెద్ద వ్యాధులు ఉన్నాయి అనుకోకండి. నిత్యం మీరు చేసే అలవాట్లు వల్ల ఇవి డిపెండ్ అవుతాయి అంటారు నిపుణులు. చూడటానికి సింపుల్ గా అనిపించవచ్చు. కానీ సమస్య మాత్రం వేరే లెవల్ లో ఉంటుంది. ఈ అలవాట్లను మార్చుకుంటే మీరు ఫుల్ యాక్టివ్ మోడ్ లో ఉంటారు. మరి ఏం మార్చుకోవాలో కూడా తెలుసుకోండి. డీహైడ్రేషన్ అవును.. మీరు విన్నది నిజమే వినడానికి సింపుల్ గా ఉన్నా డీహైడ్రేషన్ సమస్య ఉంటే అలసటగా ఉంటారట. అంటే సమయానికి నీళ్లుతాగకపోతే.. శరీరంలో తగిన స్థాయిలో నీళు లేకపోతే.. నిస్సత్తువగా నీరసంగా అనిపిస్తుందట. దాహంగా ఉన్నప్పుడే తీసుకుందాం లే అనుకుంటే అంతే సంగతలు. ఎప్పటికి అప్పుడు తాగాల్సిందే. అయితే డీహైడ్రేషన్ అప్పటికే మొదలై, మనం డల్ గా అవడం మొదలైన తర్వాత దాహంగా అనిపిస్తుంది అంటున్నారు యూనివర్సిటీ ఆఫ్ కనెక్టికట్ పరిశోధకులు చెప్తున్నారు. ఇక ఈ సమస్య మహిళల్లో ఎక్కువగా ఉంటుందట. మరొక మెయిన్ కారణం చెప్పితే నోరు తెరుస్తారు. కానీ మీ ఈ నోరు తెరవడమే కారణం. అవును రాత్రి పడుకున్నప్పుడు నోరు తెరిచి నిద్రపోవడం కూడా సమస్యనే.. కొందరు రాత్రిపూట నోరు తెరుచుకుని నిద్ర పోతారు. ఇది శరీరం డీహైడ్రేషన్‌కి దారి తీస్తుంది అంటున్నారు వైద్య నిపుణులు. అంతేకాదు ఇది మీలో శ్వాస సంబంధిత సమస్యలకు కూడా సంకేతం. ఈ అలవాటు మీకు ఉంటే విశ్రాంతి లేకుండా చేసి.. అలసటను పెంచుతుంది. దీని నివారణ కోసం శ్వాసకు సంబంధించిన ఎక్సర్ సైజులు చేస్తుండాలి. మన శరీరంలో ఐరన్ లోపం ఉంటే.. శరీరం నిస్సత్తువగా ఉంటుందట.

గరుడ వార్త











## అనన్య కొత్త మూవీ

# 'కాల్ మీ బే'

టైటిల్ ఎంపికతోనే క్యూరియాసిటీ పెంచడం సాధ్యమవుతుంది. అలాంటి ఒక టైటిల్ కాల్ మీ బే. కొన్ని వరుస పరాజయాలతో డీలా పడిపోయిన అనన్య పాండేను ఆదుకోవాల్సిన లేటెస్ట్ మూవీ ఇది. పాండే ప్రధాన పాత్రలో నటించిన కాల్ మీ బే కామెడీ సిరీస్ త్వరలో అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది.. కరణ్ జోహార్ సోమవారం నాడు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో కొత్త పోస్టర్‌ను షేర్ చేసి ఈ సిరీస్ సెప్టెంబర్ 6 నుంచి స్ట్రీమింగ్ కానుందని ప్రకటించారు. కొత్త పోస్టర్‌లో అనన్య ఎరుపు, తెలుపు రంగు దుస్తులు ధరించి, సూట్‌కేసులపై కూర్చుని కెమెరా వైపు చూస్తోంది. అనన్య పాండే బెల్లా బే చౌదరి అనే పాత్రలో నటిస్తోంది. 8-భాగాల సిరీస్‌లో వీర్ దాస్, గుర్ఫతే పిర్జాదా, వరుణ్ సూద్, విహాన్ సమత్, ముస్కాన్ జాఫేరి, నిహారిక లైరా దత్, లిసా మిశ్రా, మినీ మాథుర్ తదితరులు నటిస్తున్నారు. ఇషితా మోయిత్రా, సమీనా మోట్లేకర్, మరియు రోహిత్ నాయర్ రచయితలు. కొలిన్ డికున్హా దర్శకత్వం వహించారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. అనన్య పాండే చివరిసారిగా ఆయుష్మాన్ ఖురానాతో కలిసి డ్రీమ్ గర్ల్ 2లో కనిపించింది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయం సాధించింది. తదుపరిఖో గయే హమ్ కహాన్ మరో చక్కని విజయం అందించింది. అర్జున్ వరైన్ సింగ్ తెరకెక్కించిన ఈ చిత్రంలో నటనకు ఆస్కారం ఉన్న పాత్రలో అనన్య అద్భుతంగా నటించిందని కితాబు దక్కింది. అనన్య తదుపరి కంట్రోల్, ది అన్‌టోల్డ్ స్టోరీ ఆఫ్ సి శంకరన్ నాయర్ చిత్రాల్లో నటించేందుకు సిద్ధమవుతోంది.

## టాప్ హీరోయిన్స్‌కు షాక్‌లు....
## దిమ్రి వెంటబడుతున్న దర్శకులు



రణబీర్ కపూర్ నటించిన 'యానిమల్'లో ఘాటైన సన్నివేశాల్లో జీవించిన త్రిప్తి దిమ్రి ఆ తర్వాత కెరీర్ బెస్ట్ ప్రాజెక్టుకు కమిటవుతోంది. వరుసగా బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో త్రిప్తి బిజీ అయిన సంగతి తెలిసిందే. పలు ఫ్రాంఛైజీ చిత్రాల్లో సీక్వెల్స్ లో నటిస్తున్న ఈ బ్యూటీ జాన్వి కపూర్, కియారా అద్వానీ లాంటి క్రేజీ భామల అవకాశాలకు గండి కొట్టింది. త్రిప్తీ దిమ్రీ 'బ్యాడ్ న్యూజ్'లో విక్కీ కౌషల్, అమ్మీ విర్క్‌లతో కలిసి కనిపిస్తుంది. ఈ చిత్రంలో అనన్య పాండే అతిథి పాత్రలో కనిపిస్తుంది. ఆనంద్ తివారీ దర్శకత్వం వహిస్తున్నారు. జూలై 19న సినిమా విడుదల కానుంది. ఈ సినిమా కథాంశం పూర్తిగా కాంప్లికేటెడ్. దీనిలో ఇద్దరు వేర్వేరు మగవారి వీర్యంతో కవలలకు గర్భవతి అయ్యే యువతి కథాంశమిది. కార్తీక్ ఆర్యన్ తో భూల్ భులయా 3లో కియరా అద్వాణీ నటించాల్సి ఉండగా.. త్రిప్తీతో రీప్లేస్ చేసారు. భూల్ భూయయ్య 3 లో విద్యాబాలన్ కూడా నటించనున్నారు. ఈ చిత్రానికి అనీస్ బాజ్మీ దర్శకత్వం వహిస్తున్నారు. మాధురి దీక్షిత్ కూడా ఈ చిత్రంలో ప్రత్యేక ప్రదర్శనలో కనిపిస్తుంది. జాన్వీ కపూర్ నటించిన ధడక్ చిత్రానికి ప్రస్తుతం సీక్వెల్ తెరకెక్కుతోంది. నవంబర్ 22 న ధడక్ 2 థియేటర్లలో విడుదల కానున్నట్లు కరణ్ జోహార్ ప్రకటించారు. ధడక్ లో జాన్వి కపూర్, ఇషాన్ ఖాటర్ నటించగా, ధడక్ 2 లో త్రిప్తి డిమ్రీ %-% సిద్ధంత్ చతుర్వేది జంటగా నటిస్తున్నారు. ఒరిజినల్ ధడక్ తరహాలోనే మధ్యతరగతి రిచ్ క్లాస్ నడుమ ప్రేమాయణాన్ని ఇందులో చూపిస్తున్నారు. ఈ చిత్రానికి షాజియా ఇక్బాల్ దర్శకత్వం వహిస్తున్నారు. ధర్మ ప్రొడక్షన్స్, జీ స్టూడియోస్, క్లౌడ్ 9 పిక్చర్స్ నిర్మిస్తున్నాయి. జాన్వీ నటించాల్సిన సినిమాలో త్రిప్తీకి అవకాశం దక్కింది. రాజ్‌కుమ్మర్ రావు 'విక్కీ విద్యా కా వోహ వాలా' చిత్రంలో త్రిప్తి అవకాశం అందుకుంది. ఈ ఏడాది అక్టోబర్ 11 న ఈ చిత్రం విడుదల కానుంది. రాజ్ షాండిలియా దర్శకత్వం వహిస్తున్నారు. ఇది కామెడీ-డ్రామా అని చెబుతున్నారు.



## మాయలో పడేస్తుంది

ఇటీవల కాలంలో తెలుగులో ప్రత్యేక గుర్తింపు పొందిన అందాల తారల్లో మీనాక్షి చౌదరి ఒకరు. ఏ డ్రెస్సులో కనిపించినా, ఈమె కుర్రాళ్ళ హృదయాలను కట్టిపడేస్తుంది. సినిమాల కన్నా సోషల్ మీడియాలో తన గ్లామర్ ఫోటోలతో ఎక్కువగా అభిమానులను సంపాదించుకుంటోంది. మిస్ ఇండియా హర్యానా టైటిల్ గెలుచుకున్న మీనాక్షి, మోడల్‌గా మంచి గుర్తింపు పొందిన తర్వాత 2019లో హిందీ సినిమా "అప్ స్టార్ట్స్" ద్వారా వెండితెరకు పరిచయమైంది. అనంతరం, టాలీవుడ్ వైపు రాగా "ఇచ్చట వాహనములు నిలుపరాదు" సినిమాతో మొదట అడుగు పెట్టింది. రవితేజతో చేసిన "ఖిలాడి"లో నటించి, హిట్ 2 మరియు గుంటూరు కారం వంటి సినిమాలలో మెరిసి ప్రేక్షకుల మనసులు దోచుకుంది.

మీనాక్షి తన గ్లామర్ ఫోటోలతో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తుంది. ఆమె నవ్వు, ఫోజులతో కుర్రాళ్ళను మంత్రముగ్ధుల్ని చేస్తోంది. రీసెంట్‌గా పోస్ట్ చేసిన ఫోటోల్లో పెద్దగా గ్లామర్ చూపించకపోయినా, తన నవ్వుతోనే అందరిని ఆకట్టుకుంది. ఫాలోవర్స్ పాజిటివ్ రియాక్షన్లు ఇస్తూ, ఆమె అందాన్ని ప్రశంసిస్తున్నారు. "నీ లుక్స్ తోనే మైమరచిపోయేలా చేస్తున్నావు" అంటూ కామెంట్లు చేస్తున్నారు. మీనాక్షి ఎలా కనిపించినా అందమే అంటూ మరికొందరు పాజిటివ్ గా రియాక్ట్ అవుతున్నారు.



# దేశంలోనే తొలి క్వాంటమ్ డైమండ్ మైక్రోచిప్ ఇమేజర్




సెమీకండక్టర్ చిప్‌ల కోసం దేశంలోనే తొలి అధునాతన సెన్సింగ్ పరికరాన్ని నిర్మించే నిమిత్తం ఐటీ దిగ్గజ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), ఐఐటీ బాంబే మంగళవారం చేతులు కలిపాయి. దీని ద్వారా చిప్ వైఫల్యాలను తగ్గించొచ్చని, ఎలక్ట్రానిక్ పరికరాల సామర్థ్యాన్ని మెరుగుపరచవచ్చని టీసీఎస్ పేర్కొంది. దేశంలోనే తొలి క్వాంటమ్ డైమండ్ మైక్రోచిప్ ఇమేజర్‌ను నిర్మించడానికి ఐఐటీ బాంబేతో ఒక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నామని వివరించింది. వచ్చే రెండేళ్లలో పీక్వెస్ట్ ల్యాబ్‌లో క్వాంటమ్ ఇమేజింగ్ ప్లాట్‌ఫారాన్ని అభివృద్ధి చేసేందుకు ఐఐటీ బాంబే ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ కస్తూరి సాహాతో కలిసి టీసీఎస్ నిపుణులు పనిచేస్తారు. క్వాంటమ్ డైమండ్ మైక్రోచిప్ ఇమేజర్ అనేది ఆసుపత్రుల్లో ఎమ్ఆర్ఐ స్కాన్‌లాగా అయస్కాంత క్షేత్రాలను చిత్రీకరించగలదు. ఈ సాంకేతికతతో సంప్రదాయ సెన్సింగ్ పద్ధతుల్లో ఎదురయ్యే ఇబ్బందులనూ ఇట్టే పసిగట్టేయవచ్చు. ఏమిటి ఉపయోగం: ప్రస్తుతం అన్ని ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాల్లో సెమీకండక్టర్ చిప్‌లు ఉంటున్నాయి. ఈ అధునాతన సెన్సింగ్ టూల్‌తో సెమీకండక్టర్ చిప్‌ల పరీక్షలో కొత్త స్థాయిలకు చేరొచ్చని, చిప్ వైఫల్యాలను తగ్గించొచ్చని ఐఐటీ బాంబే తెలిపింది.

## ప్రాఫిట్ బుకింగ్ మధ్య భారీగా నష్టపోయిన మార్కెట్స్..



వచ్చే వారం వెలువడనున్న లోక్‌సభ ఎన్నికల ఫలితాలకు ముందు ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్ కు శ్రీకారం చుట్టడంతో మంగళవారం భారతీయ ఈక్విటీ బెంచ్‌మార్క్ లు నష్టాల్లో ముగిశాయి. మంగళవారం సెన్సెక్స్ 220 పాయింట్లు నష్టపోయి 75,170 పాయింట్స్ వద్ద, నిఫ్టీ 44 పాయింట్లు నష్టపోయి 22,888 పాయింట్స్ వద్ద ముగిసింది. అలాగే నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 466 పాయింట్లు నష్టపోయి 52,294 వద్ద ముగియగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 144 పాయింట్లు క్షీణించి 16,875 వద్ద ముగిసింది. భారతదేశ అస్థిరత సూచిక 4.31% క్షీణించి 24.19 వద్ద ఉంది. రంగాల వారీగా ఆటో, ఐటీ, పీఎస్‌యూ బ్యాంక్, మెటల్, రియల్టీ, ఎనర్జీ షేర్లు ఎక్కువగా నష్టపోగా., ఫార్మా, మీడియా షేర్లు లాభపడ్డాయి. పవర్ గ్రిడ్, టెక్ మహీంద్రా, ఎన్‌టిపిసి, భారతీ ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, రిలయన్స్ టాప్ లూజర్ లుగా ఉండగా., ఏషియన్ పెయింట్స్, విప్రో, హెచ్‌యుఎల్, జెఎస్‌డబ్ల్యు స్టీల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎం అండ్ ఎం మంగళవారం టాప్ గెయినర్లుగా ఉన్నాయి. బొనాంజా పోర్ట్‌ఫోలియో లిమిటెడ్ లోని రీసెర్చ్ అనలిస్ట్ వైభవ్ విద్వానీ మాట్లాడుతూ., శనివారం ఎగ్జిట్ పోల్స్ కు ముందు పెట్టుబడిదారులు జాగ్రత్తగా విధానాన్ని ఎంచుకుంటున్నారని, ఇది ఎన్నికల ఫలితాల గురించి ఒక ఆలోచన ఇవ్వగలదని అన్నారు. జూలైలో బడ్జెట్ అంచనాలు, ఇది డిఫెన్స్, ఇన్‌ఫ్రా, రైల్వే బడ్జెట్ నుండి ప్రయోజనం పొందే రంగాలకు మద్దతు ఇస్తుంది అని ఆయన చెప్పారు.

## రాజకీయాల్లోకి ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్?



ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ త్వరలో రాజకీయాల్లోకి రానున్నారా? 2024 లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాజన్ కాంగ్రెస్ చేరుతున్నారంటూ వచ్చిన వార్తల్ని ఖండించారు. తాజాగా మరోమారు ఆయన రాజకీయ రంగ ప్రవేశంపై వార్తలు వస్తున్నాయి. దీనిపైన రాజన్ స్పందించారు. రాజకీయాల్లోకి అడుగు పెట్టడం కంటే నేను చేయగలిగిన చోట మార్గనిర్దేశం చేయాలని అనుకుంటున్నాను. ఇప్పుడు అదే ప్రయత్నిస్తున్నాని తెలిపారు. ఈ విషయాన్ని పదేపదే చెబుతున్నాను. నేను విద్యా వేత్తని. 'మై బిజినెస్ ఈజ్ నాట్ కిస్సింగ్ బేబీస్'. కానీ ప్రజలు ఇప్పటికీ నా మాటల్ని నమ్మడం లేదు. పాలిటిక్స్ అంటే నా భార్యకు, నాకుటుంబానికి ఇష్టం లేదు. రాజకీయాల్లోకి రావడం తనకు ఇష్టం లేదన్నారు. అనంతరం భారత్, అమెరికా తదితర దేశాల్లోని ప్రస్తుత ఆర్థిక పరిస్థితులు, చిన్న పరిశ్రమల ముందున్న సవాళ్లు, ఆర్థిక అసమానతలపై రాజన్ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ప్రపంచ దేశాల్లో యుద్ధ భయాలతో పాటు ఇతర అంశాలే అందుకు కారణం. దీనికి తోడు అధిక వడ్డీ రేట్ల ప్రభావం ప్రపంచ వృద్ధి ఆశించిన స్థాయిలో ఉండదని తెలిపారు.

## బంగారం ధర మళ్లీ పెరిగింది....!



మొన్నటి వరకు నేల చూపులు చూసిన బంగారం ధరలు.. మళ్లీ వరుసగా మూడు రోజుల నుంచి పెరుగుతూపోతున్నాయి. నిన్నటితో పోలిస్తే బంగారం ధరలో మార్పు కనిపిస్తోంది. స్వల్పంగా పెరిగిన ఈ ధరలు.. గోల్డ్ లవర్స్‌ను మళ్లీ షాక్‌కు గురి చేస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, బంగారం, వెండిపై పెట్టుబడులు తగ్గడం లాంటివి.. ఈ ధరల హెచ్చుతగ్గులకు కారణమై ఉండొచ్చునని బిజినెస్ నిపుణులు చెబుతున్నారు. ఇక దేశంలోని పలు ప్రధాన నగరాల్లో బుధవారం బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. దేశవ్యాప్తంగా ఈరోజు బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.. దేశ రాజధాని ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 67,010కాగా, 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రూ. 73,090 వద్ద కొనసాగుతోంది. ఇక ఆర్థిక రాజధాని ముంబయిలో 22 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 66,860గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,940 వద్ద ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 67,410గా ఉండగా, 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ. 73,540 వద్ద కొనసాగుతోంది. బెంగళూరు విషయానికొస్తే ఇక్కడ బుధవారం 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,860కాగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72,940 వద్ద స్థిరంగా ఉంది. హైదరాబాద్‌లో ఈరోజు 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,860గా ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ. 72,940 వద్ద కొనసాగుతోంది. విజయవాడలో 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ. 66,860గా ఉండగా, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72,940గా ఉంది. ఇక విశాఖపట్నంలోనూ 10 గ్రాముల 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 66,860, 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 72,940 వద్ద కొనసాగుతోంది. వెండి ధరలు ఆకాశవే హద్దుగా చెలరేగిపోతున్నాయి. కిలో వెండి ధర రూ. లక్ష దాటేసింది. బుధవారం ఢిల్లీతోపాటు, ముంబయి, కోలకతా, పుణె వంటి నగరాల్లో కిలో వెండి ధర రూ. 96,600గా ఉంది. ఇక చెన్నైతో పాటు, హైదారబాద్, విజయవాడ, విశాఖపట్నం, కేరళలలో కిలో వెండి ధర రూ. 1,01,100 వద్ద కొనసాగుతోంది.

## వైద్య బీమాలోకి ఎల్ఐసి..!




ప్రభుత్వ రంగంలోని దిగ్గజ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి) వైద్య బీమా రంగంలోకి ప్రవేశించడానికి కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ అనుమతుల కోసం ఎదురు చూస్తోంది. ప్రస్తుతం జీవిత బీమా కంపెనీలు వైద్య బీమా అందించడానికి వీలు లేదు. కాగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో పార్లమెంటరీ కమిటీ కొన్ని కీలక ప్రతిపాదనలు చేసింది. బీమా సంస్థలకు వైద్య బీమా అందించడానికి కాంపోజిట్ లైసెన్స్‌ను మంజూరు చేయాలని ప్రభుత్వానికి సూచించింది. దీని వల్ల ఆయా సంస్థలకు ఖర్చులు తగ్గడంతో పాటు ఆయా సంస్థలపై నియంత్రణపరమైన భారాలు తగ్గుతాయని సూచించింది. ఇందుకోసం బీమా చట్టానికి సవరణలు చేయాల్సి ఉంటుంది. అదే జరిగితేనే వైద్య బీమా రంగంలోకి ఎల్ఐసి ప్రవేశించడానికి వీలు అవుతుంది. గడిచిన ఆర్థిక సంవత్సరం 2023- 24 మార్చి త్రైమాసికం ఆర్థిక ఫలితాల సందర్భంగా ఎల్ఐసి ఛైర్మన్ సిద్దార్థ్ మోహంతి టైమ్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. వైద్య బీమా రంగంలోకి ప్రవేశించడానికి ఎల్ఐసి ఆసక్తిగా ఉందన్నారు. పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదించిన కాంపోజిట్ లైసెన్స్‌ను అనుసరించి వైద్య బీమా రంగంలోనూ సేవలందించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నామన్నారు. కొత్త ప్రభుత్వంలో కాంపోజిట్ లైసెన్స్ లభించే అవకాశం ఉందని మోహంతి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రంగంలో తమకు అనుభవం లేనందున ఉన్న కంపెనీలను కొనుగోలు చేసే యోచనలో ఉన్నామన్నారు. ఒక వేళ ఎల్ఐసి వైద్య బీమాలోకి వస్తే ఈ రంగంలో భారీ పెరుగుదల నమోదు కానుందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి. జీవిత బీమా రంగంలో ఎల్ఐసి 58.87 శాతం వాటాతో మార్కెట్ లీడర్‌గా ఉంది. ఎల్ఐసి 2023-24 నాలుగో త్రైమాసికం (క్యూ4)లో 4.5 శాతం వృద్ధితో రూ. 13,782 కోట్ల నికర లాభాలు సాధించింది. చివరి డివిడెండ్ కింద ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ. 6 చెల్లించడానికి సంస్థ బోర్డు ఆమోదం తెలిపింది. 2024 మార్చితో ముగిసిన ఏడాదిలో సంస్థ మొత్తం ప్రీమియం రూ. 4,75,070 కోట్లుగా చోటు చేసుకుంది. 2024 మార్చి ముగింపు నాటికి ఎల్ఐసి అసెట్స్ అండర్ మేనేజ్‌మెంట్ (ఎయుఎం) రూ. 51,21,887 కోట్లకు చేరింది.

## ఐసిఐసిఐ బ్యాంక్‌కు భారీ జరిమానా...!




ప్రయివేటు రంగంలోని ఐసిఐసిఐ బ్యాంక్, యెస్ బ్యాంక్‌లకు రిజర్వ్ బ్యాంక్ షాక్ ఇచ్చింది. ఆర్‌బిఐ మార్గదర్శకాలను పాటించడంలో విఫలమైన ఆ రెండు బ్యాంక్‌లపై భారీ జరిమానా విధిస్తూ చర్యలు తీసుకుంది. 2022 మార్చి 31 నుంచి బ్యాంకు ఆర్థిక పరిస్థితులపై ఆర్‌బిఐ తనిఖీలు నిర్వహించింది. ఇందులో ఆ బ్యాంక్‌లు పలు మార్గదర్శకాలు పాటించలేదని తేలింది. ప్రాజెక్టు రిపోర్టులు, ఆర్థిక పరిస్థితులను పరిశీలించకుండానే పలు సంస్థలకు టర్మ్‌లోన్‌లు ఇచ్చినట్లు గుర్తించింది. ఈ మేరకు బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం 1949లోని పలు నిబంధనల ప్రకారం ఐసిఐసిఐ బ్యాంకుపై చర్యలు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఐసిఐసిఐ బ్యాంక్‌కు రూ. కోటి జరిమానా విధించింది.

## బ్రెజిల్‌లో దూసుకెళ్తున్న బీవైడీ.. 5000 మందికి ఉద్యోగాలు!




చైనా కార్ల తయారీ దిగ్గజం 'బీవైడీ' (బిల్డ్ యువర్ డ్రీమ్స్) గ్లోబల్ మార్కెట్లో తన ఉనికిని విస్తరిస్తూనే ఉంది. ఇందులో భాగంగానే బ్రెజిల్‌లో తన 100వ డీలర్షిప్ ప్రారంభించింది. ఈ ఏడాది చివరి నాటికి ఈ సంఖ్యను 250కి పెంచాలనే లక్ష్యంతో సంస్థ ముందుకు సాగుతోంది. బ్రెజిల్‌లో బీవైడీ 100వ డీలర్‌షిప్‌ను ఫ్లోరియానోపోలిస్ డౌన్‌టౌన్‌లో ఏర్పాటు చేసింది. ప్రస్తుతం బ్రెజిల్‌లో బీవైడీ సేల్స్ నెట్‌వర్క్ కింద 39 డీలర్ గ్రూపులను కలిగి ఉంది. అంతే కాకుండా 100 స్టోర్‌లను, 135 అవుట్‌లెట్‌ల కలిగి ఉన్నట్లు సమాచారం. రాబోయే రోజుల్లో కంపెనీ బ్రెజిల్‌లో మరో 150 కొత్త స్టోర్‌లను నిర్మించనుంది. 2024 చివరి నాటికి 250 డీలర్‌షిప్‌లను ఏర్పాటు చేయాలంటే.. నెలకు కనీసం 19 డీలర్‌షిప్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. బ్రెజిల్‌లో తన ఉనికిని విస్తరిస్తూ.. విక్రయాల నెట్‌వర్క్ పెంచడానికి కంపెనీ యోచిస్తోంది.

## అమరరాజా ఎనర్జీ లాభం రూ.230 కోట్లు




అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ గత ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికానికి రూ. 230 కోట్ల నికరలాభాన్ని ప్రకటించింది. 2022-23 ఇదే కాల లాభం రూ. 142 కోట్లతో పోలిస్తే, ఇది 62% అధికం. కార్యకలాపాల ఆదాయం కూడా రూ. 2433 కోట్ల నుంచి రూ. 2908 కోట్లకు పెరిగింది. గత ఆర్థిక సంవత్సరం పూర్తి కాలానికి ఈ సంస్థ రూ. 934 కోట్ల నికరలాభాన్ని నమోదు చేసింది. 2022-23లో ఈ మొత్తం రూ. 731 కోట్లు మాత్రమే. ఇదే సమయంలో ఆదాయం రూ. 10,392 కోట్ల నుంచి రూ. 11,708 కోట్లకు పెరిగింది. ప్రతి షేరుపై రూ. 5.10 తుది డివిడెండ్ ఇవ్వాలని కంపెనీ యాజమాన్యం ప్రతిపాదించింది. గత ఆర్థిక సంవత్సరంలో అన్ని విభాగాల్లో మెరుగైన పనితీరు నమోదు చేసినట్లు అమరరాజా సీఎండీ జయదేవ్ గల్లా వివరించారు. ఆటోమోటివ్ ఆఫ్టర్ మార్కెట్, డేటా సెంటర్ విభాగాల్లో కొత్త ఉత్పత్తులు విడుదల చేసినట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హర్షవర్ధన గౌరినేని వివరించారు.

# పత్తి విత్తనాల కోసం తొక్కిసలాటలు ..ధర్నాలు

హైదరాబాద్: తెల్లబంగారం పంటసాగుకు ముందే తళుకులీనుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో పత్తిపంటకు గిరాకీ పెరిగింది. తెలంగాణ రాష్ట్రంలో పండించిన పత్తి ఇతర ప్రాంతాలతో పోలిస్తే నాణ్యతా పరకంగా ఎంతో మెరుగైనదిగా ఉండటంతో తెలంగాణ పత్తికి మరింత అధిక ధరపెట్టి కొనేందుకు వ్యాపారలు పోటీలు పడుతుంటారు. కాటన్ కార్పోరేషన్ ద్వారా కొనుగోల్లతో అవసరం లేకుండానే మార్కెట్‌లో తెలంగాణ పత్తి పంట హాట్‌కేకుల్లా అమ్ముడుపోతోంది.వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రం నివేదకలో కూడా క్వింటాలు పత్తి రూ.7200పైగా చేరకునే అవకాశాలు ఉన్నట్టు వెల్లడించింది.ఈ నేపధ్యంలో ఈ సారి రాష్ట్ర రైతాంగం పత్తిసాగుపై మొగ్గు చూపుతోంది . ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందుగానే గ్రామీణ ప్రాంతాల్లో రైతుల సందడి మొదలైంది. ఈ ఏడాది నైరుతి రుతు పవనాలు ముందస్తుగా వచ్చేస్తున్నాయన్న భారత వాతావరణ కేంద్రం అంచనాల నేపథ్యంలో ఈ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా కోటి 34 లక్షల ఎకరాల విస్తీర్ణం పైగా భూముల్లో వ్యవసాయ పంటలు చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఈసారి అనూహ్యంగా 60.53 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పత్తి పంట సాగవుతుందని అంచనా వేసింది. ఇందుకోసం కోటి 20లక్షల ప్యాకెట్ల పత్తి విత్తానాలు రైతులకు అందుబాటులో ఉంచేందకు చర్యలు చేపట్టింది. గత ఏడాడి 50.59లక్షల ఎకరాల విస్తీర్ణంలో పత్తిసాగును ప్రభుత్వం అంచనా వేసింది. విత్తనాల సీజన్ ముగిసే సరికి 44.77లక్షల ఎకరాల వద్దనే పత్తిసాగు విస్తీర్ణం ఆగిపోయింది. ఎంచుకున్న లక్షంలో 88.51శాతంలోనే పత్తిసాగు జరిగింది. పత్తి విత్తనాలు కూడా 90లక్షల ప్యాకెట్ల మేరకే విక్రయాలు జరిగాయి. గత ఏడాదితోపోలిస్తే ఈ సారి ఏకంగా 16లక్షల ఎకరాల్లో పత్తిసాగు అదనంగా జరిగే అవకాశాలను అంచనా వేసి ఆమేరకు విత్తనాలు కూడా గత ఏడాదికంటే సుమారు 30లక్షల ప్యాకెట్లను అధికంగా అందుబాటులోకి తెస్తోంది. ఈ క్రమంలో రైతులకు వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల శాస్త్రవేత్తలు విస్తృత అవగాహన కల్పిస్తున్నారు. గత ఏడాది ఖరీఫ్ అనుభవాలు పరిశీలిస్తే సాధారణ సంప్రదాయ పద్ధతుల్లో సాగు చేస్తే సగటున ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి రాగా అదే హైడెన్సిటీ కాటన్ సాగు చేస్తే 12 క్వింటాళ్ల దిగుబడి లభించినట్లు నిరూపితమైంది. ఈ విధానంలో కాస్త పెట్టుబడి ఎక్కువైనా దిగుబడులు అధికంగా లభిస్తాయని నిపుణులు తెలిపారు.



**అధికసాంద్రతపై దృష్టి:**

రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌పై ప్రత్యేక దృష్టి సారించిన సర్కారు అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు ప్రోత్సహించేందుకు సిద్ధమైంది. పెట్టుబడి అధికమైనా మంచి దిగుబడులు వస్తే రైతులు లాభాలు ఆర్జించే అవకాశం ఉన్న దృష్ట్యా నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ కింద కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, జౌళి మంత్రిత్వ శాఖ హై డెన్సిటీ ప్లాంటింగ్ సిస్టం విధానం పేరిట ప్రత్యేక ప్రాజెక్టు అమలు చేస్తోంది. ఏపీ, తెలంగాణ, గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో ఐసీఏఆర్ అధిక సాంద్రత పత్తి సాగుపై ప్రదర్శన క్షేత్రాల ద్వారా రైతుల్లో అవగాహన కల్పించింది. 2022, 2023లో తెలుగు రాష్ట్రాల్లో రైతులు సాగు చేసి మంచి ఫలితాలు సాధించిన నేపథ్యంలో ఈ ఏడాది వానా కాలంలో తెలంగాణలో హై డెన్సిటీ ప్లాంటింగ్ సిస్టంపై ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓలు, రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో చీడపీడలు, తెగుళ్ల బెడద చాలా తక్కువగా ఉంటుందని నాణ్యమైన పత్తి దూది దిగుబడి లభిస్తుందని చెబుతున్నారు. మహారాష్ట్ర నాగపూర్ వార్ధాలోని ఐసీఏఆర్- సీఐసీఆర్ స్పెషల్ కాటన్ ప్రాజెక్టు కింద హయత్‌నగర్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఎంపిక చేసింది. గాసిపియం అమెరికన్ పత్తి, ఆసియా పత్తి వంటి పలు రకాల పత్తి హైబ్రీడ్ వంగడాలను ఐసీసీఆర్ శాస్త్రవేత్తలు ఎన్నో ఏళ్ల కిందట విడుదల చేసి బహుళ ప్రాచుర్యంలోకి తీసుకొచ్చారు. కూలీల కొరత, రసం పీల్చే పురుగులైన తామర పురుగు, పచ్చ దోమ నుంచి అధిగమిండంతో పాటు ఆరోగ్యవంతమైన ఏకకాలంలో పత్తి పగిలే లక్షణం ఉండటం ప్రత్యేకతని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**అదిలాబాద్‌లో విత్తనాలకోసం రైతుల ధర్నా!**

పత్తి సాగుకు గడువు సమీపిస్తుండటంతో రైతులు విత్తనాల సేకరణ వేటలో పడ్డారు. దక్షిణ తెలంగాణ ప్రాతంతో పత్తిసాగుకు పేరుగాంచిన ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో ఇప్పటికే రైతులు పత్తివిత్తనాల కోసం పడిగాపులు కాస్తున్నారు. మంగళవారం అదిలాబాద్ కేంద్రంలో విత్తనాలవెంపర్లాటలో గందరగోళం నెలకొంది. ఒక రకం విత్తనాలకోసం రైతులంతా ఒక షాపు ముందు ఎగబడటంతో తోపులాట జరిగింది. పోలీసులు జోక్య చేసుకుని రైతును క్రమపద్ధతిలో క్యూలైన్‌లో నిలబెట్టాల్సివచ్చింది. అయితే రైతులపై పోలీసులు లాఠీ చార్జి చేశారన్న వార్తలను జిలా ఎస్పీ గౌష్ ఆలం తోసిపుచ్చారు.ఎటువంటి లాఠీ చార్జి జరగలేదని స్పష్టం చేశారు. రెండురోజులు గడవకముందే తిరిగి గురువారం నాడు అదే సీన్ రీపీట్ అయింది. అదిలాబాద్ పంజాబ్ .చౌక్ వద్ద పత్తివిత్తనాల పంపిణీలో ప్రభుత్వ నిరక్షతను నిరసిస్తూ రైతులు ధర్నా నిర్వహించారు. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడ నిలిచిపోయాయి.

**1.20లక్షలప్యాకెట్లు పంపిణీ:డిఏవో పుల్లయ్య!**

అదిలాబాద్ జిల్లావరకు 1.20లక్షల ప్యాకెట్ల పత్తివిత్తనాలు పంపిణీ చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య వెల్లడించారు. జిల్లాలో 4.20లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరిగే అవకాశం ఉందన్నారు. ఇందుకోసం అన్ని కంపెనీల విత్తానాలు మొత్తం 10లక్షల ప్యాకెట్లు అవసరం ఉందని, 9లక్షల ప్యాకెట్లు ఇప్పటికే వచ్చాయని తెలిపారు. పత్తిలో 659 రకం విత్తనాలపట్ల రైతులు ఆసక్తి చూపటంతో వీటిని 50షాపుల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఈ రకం విత్తనాలు 40వేల ప్యాకెట్లు సరఫరా చేయించామన్నారు. మొత్తం 1.35లక్షల ప్యాకెట్లు అవసరం కాగా ఆ విత్తన కంపెనీ 70వేల ప్యాకెట్ల విత్తనాలు సరఫరా చేస్తోందని తెలిపారు. పత్తి విత్తనాలు నాటుకునేందుకు జూన్ రెండవ వారం వరకు సమయం ఉన్నందున రైతులు విత్తనాలకోసం ఆందోళన చెందవద్దని డిఏఓ పుల్లయ్య విజ్ఞప్తి చేశారు.

# మోడీ నోట 421 సార్లు మందిర్-మసీదు మాట
## మల్లికార్జున్ ఖర్గే విమర్శ



న్యూఢిల్లీ: కులం, మతం ప్రాతిపదికన ఓట్లు అడగరాదని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసినప్పటికీ ప్రధాని నరేంద్ర మోడీ తన లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో మందిర్-మసీదు, విచ్ఛిన్నకర అంశాల గురించి 421 సార్లు మాట్లాడారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే గురువారం తెలిపారు. ఏడవ, చివరి దశ లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగింపు రోజున ఆయన ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నరేంద్ర మోడీ గత 15 రోజుల తన ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పేరును 232 సార్లు, తన సొంత పేరును 758 సార్లు ప్రస్తావించారని, ఒక్కసారి కూడా నిరుద్యోగ సమస్య గురించి ప్రస్తావించలేదని చెప్పారు. స్పష్టమైన మెజారిటీతో ఇండియా కూటమి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, దేశానిక సమీకృత, జాతీయవాద ప్రభుత్వాన్ని అందచేస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. జూన్ 4న ప్రత్యామ్నాయ ప్రభుత్వం కోసం ప్రజలు తీర్పు ఇస్తారన్న నమ్మకం తనకు ఉందని ఆయన చెప్పారు. ఈ ప్రభుత్వానికి మరోసారి అవకాశం ఇస్తే దేశంలో ప్రజాస్వామ్యం అంతం అవుతుందన్న తమ అభిప్రాయానికి ప్రజలు కూడా ఆమోదించారని ఆయన తెలిపారు. రిచర్డ్ అటెన్‌బరో తీసిన చిత్రం తర్వాతే మహాత్మా గాంధీ పేరు ప్రపంచానికి తెలిసిందంటూ ప్రధాని మోడీ ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలపై ఖర్గే మండిపడ్డారు. మహాత్ముని గురించి మోడీ చదివి ఉండకపోవచ్చునని, కాని ప్రపంచవ్యాప్తంగా గాంధీ గురించి అందరికీ తెలుసునని ఆయన చురకలు అంటించారు.

# వ్యవసాయరంగానికి చల్లటి కబురు...

హైదారాబాద్: భానుడి భగభగలతో దేశమంతా అగ్నిగోళంలా మండుతున్న వేళ భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వ్యవసాయరంగానికి చల్లని కబురు అందించింది. నైరుతి రుతుపవనాలు గురువారం నాడు కేరళను తాకినట్లు ప్రకటించింది. ఇవి వేగంగా కదులుతూ ఈశాన్య రాష్ట్రాల వైపు విస్తరించినట్లు వెల్లడించింది. మూడు, నాలుగు రోజుల్లో రుతుపవనాలు ఆంధ్రప్రదేశ్‌లోకి ప్రవేశించే అవకాశమున్నట్లు పేర్కొంది. ఏపిలోని రాయలసీమ మీదుగా జూన్ ఐదవ తేదినాటికి తెలంగాణ రాష్ట్రంలోకి ప్రవేశించనున్నట్టు అంచనా వేసింది.



అయితే దాని కంటే ముందుగానే నైరుతి రుతుపవనాలు ఈశాన్య రాష్ట్రాలను తాకడానికి రెమాల్ తుపాను కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. సాధారణ పరిస్థితులకంటే ఒక రోజు ముందుగానే మే 31 నాటికి కేరళను నైరుతి రుతుపవనాలు తాకుతాయని ఐఎండీ అంచనా వేయగా, ఐంఎండి అంచనాలకంటే మరింత వేగంగా ఒక రోజు ముందుగానే ఇవి ప్రవేశించాయి.

లానినా అనుకూల పరిస్థితులు, భూమధ్యరేఖ వద్ద పసిఫిక్ మహాసముద్రం చల్లబడడం ఆగస్టు-సెప్టెంబరు నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. దీని వల్ల ఈ రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షం కురుస్తుందని గత నెలలో అంచనా వేసింది. వాయువ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. 1951 నుంచి 2023 వరకు ఎల్‌నినో తర్వాత లానినా వచ్చిన సందర్భాల్లో భారత్‌లో తొమ్మిదిసార్లు మంచి వర్షాలు కురిశాయని తెలిపింది.

అందుకు అనుగుణంగానే ఈ ఏడాది రుతుపవనాల కదలిక ఉందని వివరించింది .ఇదిలా ఉండగా, మన దేశంలో 52శాతం నికర సాగు భూమికి ఇప్పటికీ వర్షపాతమే ప్రధాన ఆధారంగా ఉంది. దేశ మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో ఈ సాగు భూమి నుంచి 40శాతం దిగుబడి వస్తుంది. అందుకే భారత ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతుపవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. నైరుతి రుతుపవనాలు ముందుగా కేరళను తాకిన సందర్భాలు అరుదుగానే ఉన్నాయి. భారత వాతవరణ శాఖ గణంకాల ప్రకారం కేరళలో రుతుపవనాలు ప్రవేశించే సమయం గత 150 సంవత్సరాలుగా మారుతూనే ఉంది. మొదటిసారి ముందుగా 1918లో మే 11నే ప్రవేశించాయి. అత్యంత ఆలస్యంగా 1972 జూన్ 18న ప్రవేశించాయి. ఇక గతేడాది జూన్8న, 2022లో మే 29న, 2021లో జూన్ 3న, 2020లో జూన్1న నైరుతి రుతుపవనాలు కేరళ తీరానికి తాకాయి.

**తెలంగాణలో తేలికపాటి వర్షాలు!**

జూన్ ఒకటిన తెలంగాణ రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.రాష్ట్రంలో కింది స్థాయి గాలులు ప్రధానంగా పశ్చిమ వాయువ్య దిశలనుండి వీస్తున్నాయి. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని ,ఉరుములు , మెరుపులు , గంటకు 40కిలోమీటర్ల వేగంతో వీచే బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. గురువారం నాడు రాష్ట్రంలో పలు చోట్ల తేలికపాటి వర్షాలు పడ్డాయి.

ఏటూరు నాగారంలో 5.5 ,కొస్గిలో 3, మొగుల్లపల్లిలో 2.5 మిల్లీమీటర్ల చొప్పున తుంపర్లు పడ్డాయి. మరో వైపు పటగి ఉష్ణోగ్రతలు సెగలు చిమ్మాయి. రాష్ట్రంలో గరిష్టంగా మంచిర్యాల జిల్లా కొండాపూర్‌లో 46.4డిగ్రీలు ,నీల్వాయ్‌లో 46, బెలపల్లిలో 45.8 డిగ్రీలు,హాజీపూర్‌లో 45.5, నెన్నెల్‌లో 45.4, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురంలో 45.8 , కొమరంభీమ్ జిల్లా కాగజ్ నగర్‌లో 45.7, కుంటాలలో 45.3,ఆసిఫాబాద్‌లో 45.4,పెద్దపల్లి జిల్లా సుగులంపల్లిలో 45.4డిగ్రల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

# గ్యాంగ్‌స్టర్ చోటారాజన్‌కు యావజ్జీవ కాగారార శిక్ష



ముంబై: సెంట్రల్ ముంబైలోని గాందేవిలో గోల్డెన్ క్రౌన్ హోటల్ నిర్వహిస్తున్న జాయా షెట్టిని 2001లో హత్య చేసిన కేసులో గ్యాంగ్‌స్టర్ చోటా రాజన్‌కు ముంబైలోని ప్రత్యేక కోర్టు గురువారం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. జయా షెట్టి హత్య కేసులో చోటా రాజన్‌ను దోషిగా మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్(ఎంసిఓసిఏ) కింద నమోదయ్యే కేసుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కోర్టు నిర్ధారించింది. చోటా రాజన్‌కు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఎఎం పాటిల్ తీర్పు వెలువరించారు. 2001 మే 4న చోటా రాజన్‌కు చెందిన ముఠా సభ్యులు హోటల్‌లోని మొదటి అంతస్తులో జయా షెట్టిని కాల్చి చంపారు.

# ప్రధాని పదవి పరువు తీసేలా విష విద్వేష ప్రసంగాలు : మన్మోహన్ సింగ్


న్యూఢిల్లీ: ప్రధాని మోడీ ప్రధాని పదవి పరువు తీశారని, బహిరంగ ప్రసంగాల మర్యాదలను మట్టి కలిపారని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ఓ ప్రధాని ఈ స్థాయిలో దిగజారి మాట్లాడటం, వ్యవహరించడం తన రాజకీయ జీవితంలో తాను ఎప్పుడూ చూడలేదని పేర్కొన్నారు. విపక్షాలపై విరుచుకుపడటం, ఓ వర్గాన్ని కించపరిచే విధంగా మతపరమైన విద్వేషకర ప్రసంగాలకు ఆయన దిగాడని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల ఏడవ , చివరి విడత పోలింగ్ నేపథ్యంలో ఈ కాంగ్రెస్ సీనియర్‌నేత పంజాబ్ ఓటర్లకు తమ సందేశం వెలువరించారు. తన స్థిరమౌన వైఖరికి భిన్నంగా ఈసారి ఆయన ప్రధాని మోడీపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని పదవికి ఓ స్థాయి ఉంటుంది. ప్రజలలో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించాల్సి ఉంటుంది, అయితే ఎన్నికల సభలలో ఆయన విద్వేషకర ప్రసంగాలకు తెరతీశారు. చివరకు విద్వేష ప్రసంగాలే ఆనవాయితీగా పెట్టుకున్నారని విమర్శించారు. ప్రధాని మాట్లాడే తీరు ఇదేనా అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల ప్రచార తంతును తాను నిశితంగా పరిశీలిస్తూ వస్తున్నానని ,వేదికల పై నుంచి నేతలు ఏ విధంగా మాట్లాడుతున్నారనేది గమనిస్తున్నానని , ఈ దశలో విద్వేషకర మాటలే ప్రధాని ప్రసంగాల సారాంశం అయిందన్నారు. విద్వేషకర ప్రసంగాలు స్థాయి మీరి చివరికి విషపూరితం, సంకుచితం, విభజన స్థాయికి దిగజారాయని తెలిపారు. అత్యున్నత పదవుల్లోని వారు ఎప్పుడైనా ఎక్కడైనా ఈ విదంగా ప్రజా వేదికల మీది నుంచే విభజన పాదులకు దిగుతారా? అని ప్రశ్నించారు. తానైతే తన రాజకీయ అనుభవంలో ఇటువంటి నేతను చూడలేదన్నారు. ఆయన కేవలం సమాజంలోని ఓ వర్గాన్ని లక్షంగా చేసుకుని మాట్లాడటం, లేదా విపక్షాలను తిట్టిపోయడం తన పనిగా పెట్టుకున్నాడని తనకు విదితం అయిందన్నారు. ప్రధాని అయి ఉండి, బహిరంగ సభల స్థాయిని మరీ ఈ విధంగా బజారు కీడుస్తారా? అని ప్రశ్నించారు. తాను తన జీవితంలో ఎప్పుడూ మనుష్యులను వేర్వేరు వారిగా వర్గాలుగా చూడలేదని, అంతా సమానం అనుకున్నానని, వ్యవహరించానని తెలిపారు. అయితే ప్రధాని మోడీ పనిగట్టుకుని తనపై కూడా దుష్ప్రచారానికి దిగారని, తప్పులు ప్రచారం చేశారని విమర్శించారు. తను చెప్పని మాటలను తాను చెప్పినట్లుగా ప్రచారం చేశారని, ఈ దేశ వనరులపై ముస్లింలకే తొలి హక్కు ఉందని తాను చెప్పినట్లు



మోడీ ప్రచారం సాగించడం చిల్లరతనం అయిందన్నారు. ఈ విధంగా వ్యవహరించడం బిజెపికే సొంతమైన నైజం అయిందని , వారి కాపీ రైట్ అని వ్యాఖ్యానించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తప్పులతడకల పథకాలు తీసుకువచ్చింది. చివరికి దేశ భద్రత విషయంలోనే ఈ దుర్నీతి సాగించిందని మండిపడ్డారు. దురుద్దేశపూరిత అగ్నివీర్ నియామకాల ప్రక్రియను సైన్యంలో తీసుకురావడం సబబేనా అని ప్రశ్నించారు. బిజెపికి దేశ భక్తి , ధైర్యసాహసాలు వారి సేవలు కేవలం తాత్కాలికం , కేవలం నాలుగేళ్లు నిలిచే సంగతి అయిందని , సైన్యంలో సేవలను ఈ విధంగా సంవత్సరాలుగా లెక్కకట్టడం సబబా? అని మాజీ ప్రధాని నిలదీశారు.బిజెపిది కుహనా జాతీయవాదం. బూటకపు వాదం అని మన్మోహన్ తన నిరసనను ప్రజలకు తమ బహిరంగ లేఖలో వెలువరించారు. దేశ ప్రజలు అన్ని విషయాలను నిశితంగా పరిశీలిస్తూనే ఉంటారు. వారిని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. ఇందులో మోడీ అతీతుడేమీ కాడు. అమానుష రీతిలో వ్యవహరించే తీరు ఇప్పుడు పరాకాష్టకు చేరింది. ఈ దశలో దేశ ప్రజలు అంతా ఈ దేశానికి ఇటువంటి అరాచకవాదుల నుంచి రక్షించాల్సి ఉందని, మనను మనం మనతో పాటు ఈ దేశాన్ని కాపాడుకోవల్సి ఉందని పిలుపు నిచ్చారు.

# ఎన్‌ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి సంపత్‌రాజ్ హత్య

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని సత్యసాయి జిల్లాలో గురువారం ఎన్‌ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి, న్యాయవాది సంపత్‌రాజ్ మృతదేహం లభించింది. ధర్మవరం పట్టణంలోని ఒక చెరువులో సంతప్‌రాజ్ మృతదేహం లబించింది. మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గుర్తుతెలియని వ్యక్తులు సంపత్‌రాజ్‌ను హత్యచేసి మృతదేహాన్ని చెరువులో పడేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.



మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ధర్మవరం మండలంలోని ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన సంపత్‌రాజ్ గత 20 ఏళ్లుగా హిందూపురంలో నివసిస్తున్నారు. ఎన్‌ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన కేరళలో పార్టీ ఇన్‌చార్జిగా కూడా వ్యవహరిస్తున్నారు.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com